ప్రజా గళమే
స్పందన
SPANDHA NEWS
జాతీయ తెలుగు దినపత్రిక
Praja Galame Spanda సత్యానికి స్వరం APMUL/26/A3106

శనివారం || 10-10-2026 || సంపుటి: 1 || సంచిక: 66 || పేజీలు: 8 || వెల : రూ.5/-

Circulated From : Guntur, Vijayawada, Visakhapatnam, Prakasham, Nellore, Thirupathi, Hyderabad, Rangareddy, Medak, Karimnagar, Warangal




## స్టార్‌డమ్‌కు దూరంగా ఆయేషా టకియా

అక్కినేని నాగార్జున సరసన 'సూపర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించడంతో పాటు, సల్మాన్ ఖాన్‌తో కలిసి బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన ఆయేషా టకియా సినీ ప్రస్థానం మరోసారి ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. కెరీర్ అత్యున్నత శిఖరాల్లో ఉన్న సమయంలోనే వెండితెరకు స్వస్తి చెప్పిన ఆమె, వర్తమానంలో స్టార్‌డమ్‌కు దూరంగా ప్రశాంతమైన కుటుంబ జీవితాన్ని గడుపుతున్నారు.

8






# రైతు హక్కులకు రాజముద్ర



## స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం సీట్లు

### నరసింగోలులో 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమం

### దశాబ్దాల గర్భకంద్రిక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### 36 ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామన్న సీఎం

> సమాజంలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు నాడు ఎన్టీఆర్ 24 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, తాను వాటిని 34 శాతానికి పెంచానని గుర్తుచేశారు. కానీ గత ప్రభుత్వం దాన్ని తిరిగి 24 శాతానికి తగ్గించి తీవ్ర ద్రోహం చేసిందని విమర్శించారు. మళ్లీ రిజర్వేషన్లు పెంచేందుకు ప్రయత్నిస్తే ఆ గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లి అడ్డుకుందని, వారికి బీసీలంటే ఏమాత్రం గిట్టదని మండిపడ్డారు. అయినప్పటికీ తమ కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 34 శాతం సీట్లను బీసీలకే కేటాయిస్తుందని ఆయన తేల్చిచెప్పారు.

**కొండపి, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** రాష్ట్రంలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం నరసింగోలులో శుక్రవారం జరిగిన 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు ఆనం రామనారాయణ, డోలా బాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం లబ్ధిదారులకు రాజముద్రతో కూడిన కట్టుదిట్టమైన పట్టాదారు పాస్ పుస్తకాలను ఆయన స్వయంగా పంపిణీ చేసి బహిరంగ సభలో ప్రసంగించారు. ప్రకాశం జిల్లాలో 50 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న గర్భకంద్రిక భూ సమస్యలకు

మిగతా 2 లో



# ఆధారాలు సమర్పించండి

- విపక్ష నేతల వాదనలు శ్రద్ధగా విన్న రాష్ట్రపతి
- ఓట్ల చోరీపై సాక్ష్యాలు ఇవ్వాలని సూచన
- త్వరలోనే పూర్తి నివేదిక అందజేస్తామన్న రాహుల్ గాంధీ, ఖర్గే

4

# ఓటమి భయంతోనే వ్యవస్థలపై నిందలు



- విపక్షాల తీరుపై మండిపడ్డ అమిత్ షా
- ప్రాబల్యం కోల్పోయి అసత్య ప్రచారాలు

4



2

## 34 శాతం రిజర్వేషన్లు పక్కా!

స్థానిక సంస్థల్లో బీసీలకు అమలు చేసి తీరుతాం

సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే పార్టీ పరంగా అవకాశం

మంత్రి సవిత

2



## అమరావతిలో చెస్ అకాడమీ

మంత్రి నారా లోకేష్‌ను కలిసిన కోనేరు హంపి

రాజధానిలో అకాడమీ ఏర్పాటుకు విజ్ఞప్తి

సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం

2

# తీరప్రాంతం.. పర్యాటక కేంద్రం

శ్రీకాకుళంలో సుడిగాలి పర్యటన చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

3



# ఢిల్లీ లాక్ డౌన్!

సీజేపీ ఆందోళన నేపథ్యంలో రాజధానిలో హై అలర్ట్

- మోహరించిన 40 వేల మంది పోలీసులు
- 57 మెట్రో స్టేషన్లు మూసివేత.. పలు రైళ్లు రద్దు
- అత్యవసర పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ

ప్రభుత్వ ఆంక్షలపై సుప్రీంకోర్టు అసహనం




4



4

## ఉప ఎన్నికల ఫలితాల్లో బీజేపీ హవా

పశ్చిమ బెంగాల్‌లోని రెండు అసెంబ్లీ స్థానాల్లో కాషాయ జెండా



## రిజర్వేషన్ల పేరుతో బీసీలకు దగా

3

*34 శాతం పేరుతో మోసం*

చట్ట సవరణ చేయాలని చంద్రబాబుకు తెలియదా

రాజ్యాంగ సవరణ చేయించాలి

రాష్ట్ర శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ధ్వజం

## స్థానిక పోరుకు లైన్ క్లియర్

2

ఏపీలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు సుప్రీం పచ్చజెండా



# మళ్లీ బ్రహ్మోత్సవ శోభ

- తిరుమలలో రేపు అంకురార్పణ క్రతువు
- పన్నెండో తేదీ నుంచి నవరాత్రి ఉత్సవాలు
- వాహన సేవల దర్శనానికి సర్వం సిద్ధం

3



## ఆర్టీజీఎస్ పనితీరు ఆదర్శప్రాయం

- రిజిస్ట్రార్ జనరల్ స్పెషల్ ప్రశంసలు




2

రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) పనితీరు, ఆ సంస్థ చేపడుతున్న వివిధ సాంకేతిక కార్యకలాపాలు ఎంతో ఆదర్శప్రాయంగా, అనుసరణీయంగా ఉన్నాయని రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ కుమార్ నారాయణ్ అభినందించారు.



2

## రవాణా శాఖ సేవలకు కంట్రోల్ రూమ్

వెల్లడించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

ప్రజాగళమే స్పందన జాతీయ తెలుగు దినపత్రిక

శనివారం, 10 అక్టోబర్ 2026



# అమరావతిలో చెస్ అకాడమీ

**మంత్రి నారా లోకేష్‌ను కలిసిన కోనేరు హంపి**

**రాజధానిలో అకాడమీ ఏర్పాటుకు విజ్ఞప్తి**

**సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం**

**చెస్ ఒలింపియాడ్ పతక విజేతకు అభినందనలు**

**అమరావతి, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** ప్రఖ్యాత చదరంగ క్రీడాకారిణి కోనేరు హంపి, ఆమె తండ్రి అశోక్ శుక్రవారం ఉండవల్లి నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలో చెస్ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయిలో మద్దతుగా నిలవాలని ఈ సందర్భంగా కోనేరు హంపి మంత్రికి విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తు తరాలకు చెస్ క్రీడలో శిక్షణ ఇచ్చేందుకు రాజధానిలో అకాడమీ అవసరాన్ని ఆమె వివరించారు. అకాడమీ ఏర్పాటుపై హంపి చేసిన విజ్ఞప్తి పట్ల మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారు. చదరంగం క్రీడను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అమరావతి కేంద్రంగా క్రీడాకారుల నైపుణ్యాలను వెలికితీసేలా అకాడమీ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన చెస్ ఒలింపియాడ్ 2026 మహిళల విభాగంలో భారత జట్టుకు కాంస్య పతకం దక్కిన విషయం తెలిసిందే. అలాగే వ్యక్తిగత విభాగంలో కోనేరు హంపి బోర్డు 1లో అద్భుత ప్రదర్శన కనబరిచి కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. దేశ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తూ ఈ అద్భుత విజయాలను సాధించినందుకు కోనేరు హంపిని మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పక్కా!

**స్థానిక సంస్థల్లో కచ్చితంగా అమలు చేసి తీరుతాం**

**సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే పార్టీ పరంగా అవకాశం**

**వైఎస్సార్ సీపీ అధినేత జగన్ తీరుపై తీవ్ర విమర్శలు**

**విలేకరుల సమావేశంలో మంత్రి సవిత వెల్లడి**



**పెనుకొండ, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం చిట్టచివరి వరకూ చిత్తశుద్ధితో న్యాయపోరాటం చేశామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని, అవసరమైతే ఆ స్థానాలను పార్టీ పరంగా వర్తింపజేస్తామని ఆమె స్పష్టం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు.

## జగన్‌కు అది ఇష్టం లేదు

బీసీలు రాజకీయంగా ఎదగడం ప్రతిపక్ష నేత జగన్‌కు ఏమాత్రం ఇష్టం లేదని ఆమె తీవ్ర స్థాయిలో విమర్శించారు. అందుకే ఆయన హైకోర్టులో కేసులు వేయించి బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నారని మండిపడ్డారు. బీసీల అభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా నాడు ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు బీసీలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా తగిన గుర్తింపు లభించేలా తమ ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తూ వస్తున్నాయని వివరించారు.

## 16,800 పదవులు కోల్పోయారు

1987లో మొట్టమొదటి సారిగా స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లను ఎన్టీఆర్ అందజేశారని మంత్రి తెలిపారు. ఆయన స్ఫూర్తితోనే పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1995లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచారని ఉద్ఘాటించారు. ఆనాటి నుంచి 2021 వరకూ బీసీలకు ఆ రిజర్వేషన్లు నిర్విఘ్నంగా అమలవుతూ వచ్చాయని తెలిపారు. కానీ గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ రిజర్వేషన్లను 24 శాతానికి కుదించి ఏకంగా 10 శాతం మేర కోత విధించారని ఆరోపించారు. ఈ నిర్ణయం వల్ల బీసీలు చివరిసారిగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సుమారు 16,800 పదవులు కోల్పోయారని మంత్రి సవిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# రైతు హక్కులకు రాజముద్ర

(మొదటి పేజీ తరువాయి..)

ముఖ్యమంత్రి శాశ్వత పరిష్కారం చూపారు. జిల్లాలోని 4 మండలాలు, 8 గ్రామాల్లోని సుమారు 2,915 ఎకరాల గర్భకంద్రిక భూములకు విముక్తి కల్పించి 1,301 మంది రైతులకు లబ్ధి చేకూర్చారు. కొండపి, జరుగుమిల్లి, నాగులుప్పలపాడు, సింగరాయకొండ మండలాల్లో దశాబ్దాలుగా హక్కుల కోసం ఎదురుచూస్తున్న రైతులకు రైత్వారీ పట్టాలు జారీ చేశారు. 1959 నాటి రికార్డులను పరిశీలించి ఆన్‌లైన్ రికార్డుల్లో వివరాల సవరణకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. బల్లికురవ మండలం గుడిపాడులో 68 ఎకరాల భూమి ఇనాంగా నమోదు కావడంతో వస్తున్న ఇబ్బందులను తొలగించారు. అలాగే కొత్తపట్నం మండలం పదార్థి గ్రామ పరిధిలో 1969 నాటి దళిత బాధితులకు సంబంధించిన 255 ఎకరాల భూమి వివరాలను వెబ్ ల్యాండ్ లో అప్‌డేట్ చేసి 311 కుటుంబాలకు ఊరటనిచ్చారు.

## కొండపి గడ్డపై అభివృద్ధి పనుల జాతర

నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ స్పిల్ వే, ప్రధాన తూముల నిర్మాణానికి రూ.166 కోట్లతో శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టును 2 ఏళ్లలో పూర్తి చేసి 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లోని 35 వేల మందికి తాగునీరు అందిస్తామని ప్రకటించారు. రూ.27.85 కోట్ల నిధులతో ముప్పాళ్ల వద్ద బ్రిడ్జి నిర్మాణం, పొన్నలూరు మండలం వేమూరు పాడు రోడ్డు, పాలేరు నదిపై వంతెనకు శంకుస్థాపన చేశారు. గతంలో దామచర్ల ఆంజనేయులు అందించిన సేవల స్ఫూర్తితో ప్రస్తుత మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్నారని సీఎం కొనియాడారు.

## అగాధాలు సృష్టించిన గత ప్రభుత్వం

రైతులు హలం పట్టుకుని పొలానికి వెళ్లాలి తప్ప అర్జీలు పట్టుకుని అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని చంద్రబాబు ఉద్ఘాటించారు. గత పాలకులు ఆక్రమణలు, దందాలు, భూవివాదాలు సృష్టించి రెవెన్యూ వ్యవస్థను సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేసి రాజముద్రతో కట్టుదిట్టమైన పాస్ పుస్తకాలు ఇస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 51 లక్షల పాస్ పుస్తకాల పంపిణీ లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు 40.58 లక్షల పాస్ పుస్తకాలను అందజేశామని, ఒక్క అక్టోబరులోనే 4 లక్షలకు పైగా పంపిణీ చేశామని వివరించారు. గత ప్రభుత్వం అక్రమంగా నిషేధిత జాబితాలో పెట్టిన 16.48 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించామని తెలిపారు. ప్రకాశం జిల్లాలోనే కొరిశపాడు, అద్దంకి, లింగసముద్రం, సంతమాగులూరు తదితర ప్రాంతాల్లో నిషేధిత జాబితా భూములకు విముక్తి కల్పించామని గుర్తుచేశారు.

## నదుల అనుసంధానం.. ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు

రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడటం లేదని, ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీ సహా పలువురు కేంద్ర మంత్రులను కలిసి నిధులు సాధిస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



రూ.35 వేల కోట్లతో రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను 3 ఏళ్లలోనే పూర్తి చేస్తామన్నారు. నదుల అనుసంధానంతో రాష్ట్రవ్యాప్తంగా నీటి గ్రిడ్ ఏర్పాటు చేస్తామని, వంశధార నుంచి పెన్నా వరకు, గోదావరి నుంచి కావేరి వరకు అనుసంధానం జరిగితే 4 రాష్ట్రాలకు నీటి కొరత తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రామాయపట్నం పోర్టు పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని, రూ.1.5 లక్షల కోట్లతో ప్రతిష్టాత్మక పెట్రోలియం రిఫైనరీ ఏర్పాటు కానుందని వెల్లడించారు. జల్ జీవన్ అమరజీవి జలధార కార్యక్రమం కింద రూ.31 వేల కోట్లతో ఇంటింటికీ కుళాయి ద్వారా నీరిస్తామన్నారు. పల్లె పండుగ ద్వారా రూ.11 వేల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్లకు శంకుస్థాపన చేశామని, త్వరలో మరో 6 లక్షల ఇళ్లు కూడా నిర్మిస్తామని వివరించారు.

# ఆర్టీజీఎస్ పనితీరు ఆదర్శప్రాయం

- 'సచివాలయంలోని కేంద్రాన్ని సందర్శించిన రిజిస్ట్రార్ జనరల్
- సాంకేతిక కార్యకలాపాలపై మృత్యుంజయ కుమార్ ప్రశంసలు
- డేటాలేక్ ప్రాజెక్టు ఎంతో అద్భుతమని కితాబు
- విపత్తుల నిర్వహణలో అవేర్ సేవలు అమోఘం

**అమరావతి, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) పనితీరు, ఆ సంస్థ చేపడుతున్న వివిధ సాంకేతిక కార్యకలాపాలు ఎంతో ఆదర్శప్రాయంగా, అనుసరణీయంగా ఉన్నాయని రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ కుమార్ నారాయణ్ అభినందించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రత్యేకంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికి సంస్థ పనితీరు, ప్రధాన లక్ష్యాల గురించి వివరించారు. ఆర్టీజీఎస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డేటాలేక్, అవేర్, ఆర్టీజీఎస్ సీసీటీవీ 360, యూనిఫైడ్ గవర్నెన్స్ డ్యాష్ బోర్డు, మనమిత్ర తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్న తీరు గురించి




సీఈవో విపులీకరించారు. ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో ఉన్న డేటాను ఒకే చోట అనుసంధానం చేసి, ఈ డేటాను కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ద్వారా విశ్లేషించి పాలనను మరింత సరళీకృతం చేయడానికి దోహదపడే పలు రకాల యూస్ కేసెస్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. తద్వారా పౌరులకు ప్రభుత్వ సేవలు సంక్లిష్టంగా కాకుండా మరింత సరళంగా మారి, ఎలాంటి ఆటంకాలు లేకుండా సేవలు అందుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.

## విపత్తుల నిర్వహణలో అవేర్

అవేర్ విభాగం ద్వారా నిరంతరం వాతావరణ పరిస్థితులను రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తున్నామని అధికారులు వివరించారు. దీనిద్వారా ముందస్తుగానే వాతావరణ మార్పులను పసిగట్టి వరదలు, తుఫాన్ల లాంటి విపత్తుల నుంచి ప్రజలను, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. అత్యాధునిక సాంకేతిక విశ్లేషణల ద్వారా ప్రాణనష్టం, ఆస్తినష్టాల తీవ్రతను గణనీయంగా తగ్గించగలిగేలా ఆర్టీజీఎస్ సాంకేతిక తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో నీటి లభ్యతను కూడా రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తున్నామన్నారు. అనంతరం సీసీఎల్ఏ జాయింట్ సెక్రటరీ టీఎస్ చేతన్ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీసర్వే ప్రాజెక్టు గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కేంద్ర ఉన్నతాధికారి మృత్యుంజయ కుమార్ నారాయణ్ మాట్లాడుతూ ఆర్టీజీఎస్ చేపడుతున్న వినూత్న కార్యకలాపాలను తీవ్రంగా కొనియాడారు. ప్రధానంగా డేటాలేక్ ప్రాజెక్టును ఆయన అత్యంత ఆసక్తిగా తిలకించారు. డేటాలేక్ లాంటి ప్రాజెక్టు దేశవ్యాప్తంగా అందరికీ అనుసరణీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ జె.నివాస్, ఆర్టీజీఎస్ ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ పి.శ్రీఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రవాణా శాఖ సేవలకు కంట్రోల్ రూమ్

**సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు**

**వాహన్, సారథి పోర్టళ్ల సేవల మెరుగుకు కసరత్తు**

**కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం అధికారుల సమన్వయం**

**24 గంటలూ పనిచేసే ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటు**

**వెల్లడించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**అమరావతి, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** వాహన్, సారథి పారివాహన్ పోర్టళ్ల ద్వారా రవాణా శాఖ సేవలు పొందుతున్న ప్రజలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. పోర్టల్‌లో వాహన యాజమాన్య బదిలీ, డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్, ఆధార్ వివరాల సరిపోలిక, హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ వివరాల నమోదు, సర్వర్ నెమ్మదిగా పనిచేయడం వంటి సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు అధికారులను ఆదేశించారు. దీనికోసం నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్, కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖతో ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రజల ఫిర్యాదుల కోసం రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో 24 గంటలూ పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ సేవల్లో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా ప్రజలు ఫోన్ కాల్స్ లేదా వాట్సాప్ సందేశాల ద్వారా తమ ఇబ్బందులను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. దీనికోసం ప్రత్యేకంగా 9281607001 కంట్రోల్ రూమ్



నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మంత్రి వివరించారు. వాహన యాజమాన్య బదిలీ సమయంలో సంబంధిత ఆర్టీఏ కార్యాలయాన్ని ఎంపిక చేయడంలో ఎదురైన సాంకేతిక సమస్య ఇప్పటికే పరిష్కారమైందని మంత్రి స్పష్టం చేశారు. అలాగే ఆధార్ వివరాలు డ్రైవింగ్ లైసెన్స్ వివరాలతో సరిపోలని వారు ఇతర అవసరమైన గుర్తింపు పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి రెన్యువల్‌కు సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ సేవలను ప్రజలకు మరింత సులభంగా, పూర్తి పారదర్శకంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన ఉద్ఘాటించారు. సాంకేతిక సమస్యల శాశ్వత పరిష్కారానికి సంబంధిత ఉన్నతాధికారులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు.

# స్థానిక పోరుకు లైన్ క్లియర్

- ఏపీలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు సుప్రీం పచ్చజెండా
- బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు చెల్లవన్న హైకోర్టు తీర్పు సమర్థన
- వైసీపీ దాఖలు చేసిన పిటిషన్ సైతం డిస్మిస్ చేసిన ధర్మాసనం
- పాత జాబితాతోనైనా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని వెల్లడి



**న్యూఢిల్లీ/అమరావతి, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు కల్పించిన 34 శాతం రిజర్వేషన్ల జీవోలను రద్దు చేస్తూ గతంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన ప్రత్యేక అనుమతి పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. మరోవైపు ఓటరు జాబితా ప్రక్రియ పూర్తయిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను సైతం ధర్మాసనం కొట్టివేసింది. దీంతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లయింది.

## 50 శాతం మించకూడదు..

తాజా ఓటరు జాబితా సిద్ధమైనా లేక పాత జాబితాతో అయినా స్థానిక ఎన్నికలు నిర్వహించుకోవచ్చని, ఇందులో ఎలాంటి సందేహాలు అక్కర్లేదని పిటిషనర్ తరఫు న్యాయవాదికి కోర్టు స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా క్షేత్రస్థాయి జనాభా లెక్కలు, ఎంపరికల్ డేటా ఆధారంగానే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించామని, స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వ తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ క్రమంలోనే ధర్మాసనం కలుగజేసుకుని కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగబద్ధమైన 50 శాతం రిజర్వేషన్ల సీలింగ్‌ను దాటడానికి ఏమాత్రం వీలులేదని తేల్చిచెప్పింది. హైకోర్టు తీర్పులో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఏపీ ప్రభుత్వ పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం విచారించగా.. వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది.

## రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్?

సుప్రీంకోర్టు తాజా తీర్పుతో ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 2, 3 రోజుల్లోనే ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సైతం లోకల్ బాడీ ఎన్నికలపై కీలక వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో మొదట మున్సిపల్ ఎన్నికలు, ఆ తర్వాత పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని ఆయన పేర్కొనడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తాజా పరిణామాలు ఏపీ రాజకీయాల్లో, స్థానిక ఎన్నికల ప్రక్రియలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
శనివారం, 10 అక్టోబర్ 2026

# తిరుమలలో మళ్లీ బ్రహ్మోత్సవ శోభ

- రేపు అంకురార్పణ క్రతువు
- 12 నుంచి నవరాత్రి ఉత్సవాలు
- దర్శనానికి సర్వం సిద్ధం
- భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్న టీటీడీ



**తిరుమల, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** తిరుమల శ్రీవారి ఆలయంలో మరోసారి బ్రహ్మోత్సవ శోభ సంతరించుకోనుంది. అక్టోబర్ పన్నెండు నుంచి ఇరవయ్యో తేదీ వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల పదకొండున రాత్రి ఉత్సవాలకు అంకురార్పణం నిర్వహించనున్నారు. ఇటీవల జరిగిన సాలకట్ల బ్రహ్మోత్సవాలకు హాజరుకాలేకపోయిన భక్తులకు ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలు అద్భుతమైన అవకాశం కానున్నాయి. వివిధ వాహనాలపై విహరించే శ్రీవారిని దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. చాంద్రమానం ప్రకారం ప్రతి మూడేళ్లకోసారి వచ్చే అధికమాసం సందర్భంగా కన్యామాసంలో వార్షిక బ్రహ్మోత్సవాలు, ఆశ్వయుజ మాసంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, పెద్ద రథోత్సవం, ధ్వజావరోహణం క్రతువులు నిర్వహించరు. వైఖానస ఆగమం ప్రకారం ఉత్సవాలు విజయవంతంగా జరగాలని స్వామివారిని ప్రార్థిస్తూ ఈ నెల పదకొండున అంకురార్పణ క్రతువును నిర్వహిస్తారు. స్వామివారి సేనాధిపతి శ్రీ విష్వక్సేనుల వారిని వసంత మండపానికి ఊరేగింపుగా తీసుకెళ్లి, భూమాతకు పూజలు నిర్వహించిన అనంతరం తొమ్మిది రకాల ధాన్యాలను నాటుతారు. ఈ ప్రక్రియనే అంకురార్పణం లేదా బీజవాపనం అని పిలుస్తారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు, రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు వాహనసేవలు జరగనున్నాయి. గరుడ వాహనసేవను మాత్రం రాత్రి ఆరున్నర నుంచి పదకొండున్నర గంటల వరకు నిర్వహిస్తారు. ఈ వాహనసేవల్లో మలయప్పస్వామి వారు విభిన్న వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనుండటంతో తిరుమలలో ఆధ్యాత్మిక సందడి నెలకొననుంది.

## వాహన సేవల వివరాలు

అక్టోబర్ పన్నెండున ఉదయం తొమ్మిది గంటలకు బంగారు తిరుచ్చి ఉత్సవం, రాత్రి తొమ్మిది గంటలకు పెద్దశేషవాహన సేవ జరుగుతాయి. పదమూడున ఉదయం ఎనిమిది గంటలకు చిన్నశేషవాహనం, పద్నాలుగున ఉదయం సింహ వాహనం, రాత్రి ఏడు గంటలకు ముత్యపుపందిరి వాహన సేవలు ఉంటాయి. పదిహేనున ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహన సేవలు నిర్వహిస్తారు. పదహారున ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం ఆరున్నర గంటలకు ప్రతిష్టాత్మకమైన గరుడ వాహన సేవ జరగనున్నాయి. పదిహేడున ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం నాలుగు గంటలకు పుష్పక విమానం, రాత్రి ఏడు గంటలకు గజవాహన సేవలు ఉంటాయి. పద్దెనిమిదిన ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారు విహరిస్తారు. పంతొమ్మిదిన ఉదయం ఏడు గంటలకు స్వర్ణరథం, రాత్రి ఏడు గంటలకు అశ్వవాహన సేవలు నిర్వహిస్తారు. ఇరవయ్యో తేదీ ఉదయం ఆరు గంటలకు నిర్వహించే చక్రస్నానంతో ఈ నవరాత్రి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

## భారీగా ఏర్పాట్లు పూర్తి

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో టీటీడీ అధికారులు, తిరుపతి జిల్లా యంత్రాంగం, పోలీసుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దర్శనం, వసతి, అన్నప్రసాదం, రవాణా, భద్రత, వైద్యం, పారిశుద్ధ్యం, విద్యుత్, పుష్పాలంకరణ తదితర విభాగాలను పకడ్బందీగా సిద్ధం చేశారు. ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన దర్శనం, మెరుగైన వసతులు కల్పిస్తూ బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం పూర్తి స్థాయిలో సన్నద్ధమైందని అధికారులు స్పష్టం చేశారు.

# మ్మెల్సీ ఓటరు నమోదుకు విస్తృత ప్రచారం

**ఉపాధ్యాయులందరూ పేర్లు నమోదు చేసుకునేలా చర్యలు**

**ఉమ్మడి కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల కలెక్టర్లకు ఆదేశం**

**ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈసీ సమీక్ష**

**సీనియర్ డిప్యూటీ కమిషనర్ భాను ప్రకాష్ దిశా నిర్దేశం**

**అమరావతి, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్లను కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ కమిషనర్ భాను ప్రకాష్ ఆదేశించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు ప్రాంతాలతో పాటు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికల సన్నాహక ఏర్పాట్లపై శుక్రవారం ఢిల్లీ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ వర్చువల్‌గా పాల్గొనగా, అదనపు ప్రధాన ఎన్నికల అధికారులు ఢిల్లీ రావు, వెంకటేశ్వర రావుతో పాటు సంబంధిత ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు.



## ప్రచార కార్యక్రమాలు ముమ్మరం చేయాలి

ఈ సందర్భంగా సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ భాను ప్రకాష్ మాట్లాడుతూ, ఉపాధ్యాయ ఓటర్ల నమోదు ప్రక్రియకు సంబంధించిన ప్రచార కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వివిధ ప్రచార మాధ్యమాలు, సమాచార మార్గాల ద్వారా ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృతంగా ప్రచారం కల్పించి అవగాహన పెంచాలని అధికారులను ఆదేశించారు.

## ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో క్షేత్రస్థాయి యంత్రాంగం అవలంబించాల్సిన విధానాలపై ఆయన అధికారులకు స్పష్టమైన దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలకు కచ్చితంగా లోబడి పనిచేయాలని ఆదేశించారు. ఎలాంటి చిన్నపాటి పొరపాట్లకు కూడా తావులేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని భాను ప్రకాష్ స్పష్టం చేశారు.



# తీరప్రాంతం.. పర్యాటక కేంద్రం

**శ్రీకాకుళంలో సుడిగాలి పర్యటన చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

**మొగదలపాడులో వందేళ్ల భూ సమస్యకు శాశ్వత పరిష్కారం**

**పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న అచ్చెన్నాయుడు, శంకర్**

**శ్రీకాకుళం, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** శ్రీకాకుళం తీరప్రాంతాన్ని అద్భుతమైన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఉద్ఘాటించారు. శుక్రవారం ఆయన శ్రీకాకుళం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు చేయడంతో పాటు నూతన భవనాలను లాంఛనంగా ప్రారంభించారు. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడులో అమృత్ 2.0 పథకం కింద 25.34 కోట్లతో 1,200 కిలోలీటర్ల సామర్థ్యం గల భారీ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. సింగుపురం పాఠశాలలో 2.12 కోట్లతో నిర్మించిన అదనపు గదులు, డార్మిటరీ భవనాలతో పాటు గార మండలం సాలిహుండం పాఠశాలలో 2.55 కోట్లతో పూర్తి చేసిన డార్మిటరీ గదులను ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అనంతరం గార మండలం మొగదలపాడులో గ్రామస్తులకు రెవెన్యూ పట్టాల పంపిణీ కార్యక్రమంలో కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దాదాపు వందేళ్లుగా సర్వే, రెవెన్యూ రికార్డులు, భూమి యాజమాన్య ఆధారాలకు సంబంధించి దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ గ్రామానికి ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించడం ఎంతో ఆనందంగా ఉందని రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో హక్కుల కోసం ఎదురుచూసిన ఎంతోమందికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ప్రత్యేకంగా చర్చించి ఈ భూ సమస్య పరిష్కారానికి గట్టిగా కృషి చేశామని ఆయన గ్రామస్తులకు వివరించారు. ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న ఈ సుదీర్ఘ సమస్య పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కేంద్ర మంత్రి ఈ సందర్భంగా వేదికపై అభినందించారు. మిగిలిన అర్హులైన గ్రామస్తులందరికీ కూడా అతి త్వరలో పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

# దుర్గా మండపాలకు ఉచిత విద్యుత్

- గ్రామీణ ప్రాంతాల్లో 3 కిలోవాట్ల వరకు వెసులుబాటు
- పట్టణాల్లో 5 కిలోవాట్ల వరకు ఉచిత కరెంటు
- వెల్లడించిన ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

**విజయవాడ, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** విజయదశమి పండుగ సందర్భంగా దుర్గాదేవి మండపాలకు ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 కిలోవాట్లు, పట్టణ ప్రాంతాల్లో 5 కిలోవాట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు క్షేత్రస్థాయి విద్యుత్ శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అనుమతి పొందిన దుర్గా మండపాల నిర్వాహకులు నిర్ణీత నమూనాలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

## తాత్కాలిక కనెక్షన్ నిబంధనలు

నిర్దేశించిన పరిమితికి మించి విద్యుత్ లోడ్ అవసరమైతే మాత్రం సాధారణ తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ నిబంధనలు వర్తిస్తాయని అధికారులు స్పష్టం చేశారు. దుర్గా మండపాలకు విద్యుత్ సరఫరా చేసే ముందు సిబ్బంది అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సీఎండీ ఆదేశించారు. పండుగ సందర్భంగా ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా మండపాల నిర్వాహకులు సైతం అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా అమ్మవారి మండపాలను సురక్షిత ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని కోరారు.



## నాణ్యమైన పరికరాలే వాడాలి

మండపాల పైనుంచి విద్యుత్ తీగలు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపైనే ఉందని అధికారులు గుర్తుచేశారు. విద్యుత్ అలంకరణల కోసం నాణ్యమైన వైర్లు, స్విచ్‌లు, ప్లగ్‌లను మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. విద్యుత్ కనెక్షన్లు, అలంకరణల ఏర్పాటు విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడినా, వేలాడుతున్నా పొరపాటున కూడా వాటిని తాకకుండా దూరంగా ఉండాలని హెచ్చరించారు. అటువంటి అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని లేదా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని సీఎండీ పుల్లారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రిజర్వేషన్ల పేరుతో బీసీలకు దగా

**34 శాతం పేరుతో ముఖ్యమంత్రి మోసం**

**చట్ట సవరణ చేయాలని చంద్రబాబుకు తెలియదా అని ప్రశ్న**

**రాజ్యాంగ సవరణ చేయించాలని పాలకులకు సవాల్**

**రాష్ట్ర శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ధ్వజం**



**విజయనగరం, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు వారిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దారుణంగా మోసం చేశారని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. బీసీలకు నిజంగా న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే, డబుల్ ఇంజిన్ సర్కారుగా చెప్పుకునే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి వెంటనే రాజ్యాంగ సవరణ చేయించాలని ఆయన సవాల్ చేశారు. అంతేకానీ కోర్టుల్లో ఏమాత్రం నిలబడవని తెలిసి కూడా ప్రజలను మభ్యపెట్టేలా నిర్ణయాలు తీసుకుని బీసీ వర్గాలను దగా చేయడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. విజయనగరంలోని జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయం న్యాయపరంగా నిలబడుతుందా లేదా అనే విషయాన్ని ముందుగానే ఆలోచించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై లేదా అని బొత్స సత్యనారాయణ సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న బీసీ సోదరులకు రాజ్యాంగపరమైన హక్కులు, చట్టపరమైన అంశాలు తెలియవని భావించడం దారుణమన్నారు. ప్రభుత్వం ఏది చెప్పినా గుడ్డిగా నమ్ముతారని అనుకోవడం చంద్రబాబు రాజకీయ అహంకారానికి నిదర్శనమని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ వర్గాలకు న్యాయం చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి, ఇప్పుడు ఆ మాటను నిలబెట్టుకునే దిశగా స్పష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబు మభ్యపెడితే ఇకపై మోసపోవడానికి బీసీలు సిద్ధంగా లేరని, ఆయన చేసే కుట్రలకు సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధి చెబుతారని బొత్స హెచ్చరించారు. కేవలం రిజర్వేషన్లు కల్పిస్తామని పైపైన చెప్పడం మాత్రమే సరిపోదని ఆయన హితవు పలికారు. న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి రాజ్యాంగబద్ధమైన మార్గంలో రిజర్వేషన్లు అమలయ్యేలా చూడటం ప్రభుత్వ కనీస బాధ్యత అని గుర్తుచేశారు. బీసీలకు ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి ప్రజలకు బహిరంగంగా సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. లేనిపక్షంలో బలహీన వర్గాలకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు తమ పార్టీ పక్షాన రాజీలేని పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఆర్థిక నివేదికలే ప్రగతికి దిక్సూచి

**ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు ఆదేశం**

**సెప్టెంబర్ నెల ఆర్థిక నివేదికపై అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష**

**వ్యవసాయంతో పాటు పారిశ్రామిక, సేవా రంగాలు పుంజుకోవాలి**

**క్షేత్రస్థాయిలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యం**



**అమరావతి, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** ప్రతి నెలా ఆర్థిక నివేదికలు సమర్పించడంతో పాటు, ఆ నివేదికల ఆధారంగా ఆయా రంగాల అభివృద్ధికి తీసుకోవాల్సిన దిద్దుబాటు చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ప్రణాళిక శాఖ అధికారులు సెప్టెంబర్ నెల ఆర్థిక నివేదికను క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రికి సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థూల ఆర్థిక స్థితిగతులు, వివిధ రంగాల పనితీరు, ద్రవ్యోల్బణ పరిస్థితులపై సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

## జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యం

రాష్ట్రంలో సాధించే ఆర్థిక ప్రగతి క్షేత్రస్థాయిలో ప్రజల జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచేలా ప్రణాళికాబద్ధంగా ఉండాలని సీఎం పేర్కొన్నారు. కేవలం నివేదికలు తీసుకోవడం, వాటిపై చర్చించుకోవడానికే పరిమితం కాకుండా లోపాలను సరిదిద్దుకునేలా మార్పులు చేర్పులపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల నుంచి జిల్లా కలెక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ దీనికి అనుగుణంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఆర్థిక నివేదికలను ఆయా శాఖలకు అందించి, పనితీరును మెరుగుపరుచుకోవడానికి అవసరమైన మార్గదర్శకాలను వివరించాలని చెప్పారు.

## నిపుణుల బృందం సేవలు

ప్రస్తుతం వ్యవసాయ రంగంలో మంచి వృద్ధి కనిపిస్తోందని, అదే తరహాలో సేవల రంగం, పారిశ్రామిక రంగాలు సైతం వేగంగా పుంజుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇందుకోసం వివిధ రంగాల నిపుణుల సలహాలు తీసుకోవాలని, ప్రత్యేకంగా నిపుణుల బృందాన్ని గుర్తించి వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో అమలవుతున్న ఉత్తమ పద్ధతులను గుర్తించి, మన రాష్ట్ర పరిస్థితులకు తగినట్లుగా వాటిని అమలు చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రధాని ప్రశంసలు.. నియోజకవర్గ ప్లాన్లు

దేశంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నియోజకవర్గాల స్థాయిలో ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తున్నందుకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారని సీఎం వెల్లడించారు. క్షేత్రస్థాయిలో ఉండే స్థానిక అవకాశాలను అంతర్జాతీయ మార్కెట్లకు చేరేలా చూడాలని ప్రధాని సూచించారని గుర్తుచేశారు. ఈ దిశగా ప్రతి నియోజకవర్గంలో విజన్ యూనిట్ ప్లాన్లను సమర్థవంతంగా అమలు చేయాలని, నిత్యావసరాల ధరలు పెరగకుండా గట్టి నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సాయి ప్రసాద్, ఆర్థిక, ప్రణాళిక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
శనివారం, 10 అక్టోబర్ 2026




# ఢిల్లీ లాక్ డౌన్!

**సీజేపీ ఆందోళన నేపథ్యంలో రాజధానిలో హై అలర్ట్**

**మోహరించిన 40 వేల మంది పోలీసులు**

**57 మెట్రో స్టేషన్ల మూసివేత.. పలు రైళ్లు రద్దు**

**అత్యవసర పిటిషన్ పై సుప్రీంకోర్టులో విచారణ**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), పలు విద్యార్థి సంఘాలు తలపెట్టిన భారీ నిరసన నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. దేశ రాజధాని దాదాపుగా లాక్‌డౌన్ దిశగా మారింది. ఢిల్లీ వ్యాప్తంగా దాదాపు 40 వేల మంది పోలీసుల బలగాలు రంగంలోకి దిగాయి. భద్రతా బలగాలు నగరంలోని హోటళ్లు, షెల్టర్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. మరోవైపు జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిరసనలకు పోలీసులు అనుమతిని నిరాకరించారు. జంతర్ మంతర్ పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 163 అమలులో ఉందని స్పష్టం చేశారు. నీట్ అవకతకలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్ చేస్తూ సీజేపీ ఇటీవల చేపట్టిన నిరసనలో హింస చెలరేగడంతో రేపటి నిరసనపై కేంద్రం ప్రత్యేక ఫోకస్ పెట్టింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా రంగంలోకి దిగారు. తన పర్యటనలన్నీ రద్దు చేసుకుని ఢిల్లీలో మకాం వేసి భద్రతా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా ఢిల్లీ సరిహద్దు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్ర హోంశాఖ ప్రత్యేకంగా లేఖ రాసింది. సరిహద్దుల్లో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, ఆకతాయిలు, అరాచక శక్తుల కదలికలపై నిఘా ఉంచాలని సూచించింది. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా రైల్వేశాఖ కూడా కీలక నిర్ణయం తీసుకుంది. హజ్రత్ నిజాముద్దీన్, న్యూఢిల్లీ రైల్వే స్టేషన్లలో రేపు మధ్యాహ్నం 2 గంటల వరకు ఆంక్షలు విధించింది. గోరఖ్‌ధామ్ ఎక్స్‌ప్రెస్, లక్నో మెయిల్, ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ వంటి పలు కీలక మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసింది. మరోవైపు ఈ రాత్రి 9 గంటలకే 57 మెట్రో రైల్ స్టేషన్లను మూసివేయాలని పోలీసులు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు లేఖ రాశారు. శాంతిభద్రతల పరిరక్షణ, అవాంఛనీయ ఘటనల నివారణ చర్యల్లో భాగంగా సెంట్రల్ విస్తీర్ణంలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తూ కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. జనపథ్, కర్తవ్యపథ్ క్రాసింగ్ పరిసర ప్రాంతాల్లో దాదాపు 4 కిలోమీటర్ల వ్యాసార్థం పరిధిలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేసేందుకు ఆమోదం తెలిపింది. ఈ తాత్కాలిక ఆంక్షలు అక్టోబర్ 9 రాత్రి 10 గంటల నుండి అక్టోబర్ 10 రాత్రి 10 గంటల వరకు వరుసగా 24 గంటల పాటు పూర్తి స్థాయిలో అమల్లో ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు.

**సుప్రీంకోర్టులో అత్యవసర విచారణ**

నగర వ్యాప్తంగా విధించిన ఆంక్షలు, 57 మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలైంది. సీపీఐ(ఎం) నాయకుడు ఎం.ఎ. బేబీ తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వి, ప్రశాంత్ భూషణ్, గోపాల్ శంకరనారాయణన్‌లు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. కేవలం శాంతిభద్రతల నెపంతో రాజధానిని మొత్తంగా లాక్‌డౌన్ చేయడం సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని గట్టిగా వాదించారు. విచారణ సందర్భంగా జస్టిస్ జయమాల్య బాగ్చి స్పందిస్తూ, ముందస్తు అనుమతి లేకుండా నిరసనలు చేపట్టడం చట్టపరంగా సరికాకపోయినప్పటికీ, అది రాజ్యాంగ విరుద్ధం కాదని స్పష్టం చేశారు. కేవలం ఊహాజనిత భయాలతో నగరంలో ప్రజా రవాణాను స్తంభింపజేయడం తగదని, మెట్రో రైళ్ల రాకపోకలపై పూర్తి నిషేధం విధించరాదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఆంక్షల వల్ల వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున, రవాణా పరిమితులపై పునరాలోచించాలని ధర్మాసనం సూచించింది. ప్రభుత్వం, నిరసనకారుల ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాతే ఈ ఆంక్షలపై తుది ఉత్తర్వులు ఇస్తామని సుప్రీంకోర్టు వెల్లడించింది.

# ఓటమి భయంతోనే వ్యవస్థలపై నిందలు

**విపక్షాల తీరుపై మండిపడ్డ అమిత్ షా**

**ప్రాబల్యం కోల్పోయి అసత్య ప్రచారాలకు తెర**

**ప్రతిపక్షాల ద్వంద్వ నైజాన్ని గుర్తించిన ఓటర్లు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ఇండీ కూటమి చేస్తున్న అబద్ధాలు, అయోమయం, దురుద్దేశ పూర్వక దుష్ప్రచారాలను తిప్పికొడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ఎన్నికల్లో వరుస విజయాలు సాధిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ రోజు



వెలువడిన ఉప ఎన్నికల ఫలితాలపై ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ఎక్స్ వేదికగా స్పందించారు. పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరి ఉప ఎన్నికల్లో ఎన్డీయే సాధించిన ఘన విజయాలతో పాటు, ఇటీవల రాజస్థాన్, త్రిపుర మున్సిపల్ ఎన్నికల ఫలితాలు దేశ ప్రజల ఆలోచనను స్పష్టంగా చాటుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఇండీ కూటమిలోని పార్టీలను, వారి రాజకీయ విధానాలను పూర్తిగా తిరస్కరించారనడానికి ఈ వరుస విజయాలే ప్రత్యక్ష నిదర్శనమని అమిత్ షా తేల్చిచెప్పారు. ప్రజాక్షేత్రంలో తమ ప్రాబల్యాన్ని, ఓటు బ్యాంకును కోల్పోయిన విపక్ష పార్టీలు ప్రతి ఓటమి తర్వాత దేశంలోని రాజ్యాంగబద్ధ వ్యవస్థలను, సంస్థలను ప్రశ్నించడం పరిపాటిగా మార్చుకున్నాయని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రతిపక్షాల ఈ ద్వంద్వ నైజాన్ని, రాజకీయ ఎత్తుగడలను ప్రజలు ఇప్పటికే స్పష్టంగా గుర్తించారని తెలిపారు. అందుకే ప్రజలు విపక్షాల అసత్య ప్రచారాలను ఏ మాత్రం పట్టించుకోకుండా, ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనపై తమకున్న తిరుగులేని విశ్వాసాన్ని చాటుతూ బీజేపీకి అఖండమైన ప్రజా తీర్పును కట్టబెట్టారని అమిత్ షా పునరుద్ఘాటించారు. దేశవ్యాప్తంగా వస్తున్న ఎన్నికల ఫలితాలు ఎన్డీయే కూటమికి ప్రజల్లో ఉన్న బలమైన ఆదరణను మరోసారి నిరూపించాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# ఆధారాలు సమర్పించండి

- **విపక్ష నేతల వాదనలు శ్రద్ధగా విన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**
- **ఓట్ల చోరీ ఆరోపణలపై సాక్ష్యాలు ఇవ్వాలని సూచన**
- **త్వరలోనే పూర్తి నివేదిక అందజేస్తామన్న రాహుల్ గాంధీ, ఖర్గే**
- **సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఇండియా కూటమి ఎంపీలు శుక్రవారం సాయంత్రం ఢిల్లీ వీధుల్లో భారీ ఆందోళన చేపట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, ఈవీఎంలకు స్వస్తి చెప్పి బ్యాలెట్ పేపర్ల ద్వారానే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ విపక్ష నేతలు పార్లమెంట్ హౌస్ నుంచి రాష్ట్రపతి భవన్ వైపు మార్చ్‌గా బయలుదేరారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అనే పెద్ద బ్యానర్‌తో వెళ్లిన ఎంపీలను పోలీసులు విజయ్ చౌక్ వద్ద బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు విజయ్ చౌక్ వద్ద ఎంపీలు ధర్నాకు దిగి ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**రాష్ట్రపతితో 10 మంది నేతల భేటీ**

పోలీసు ఆంక్షల మధ్య 10 మంది సభ్యులతో కూడిన ఇండియా కూటమి ప్రధాన ప్రతినిధి బృందానికి మాత్రమే రాష్ట్రపతి భవన్‌లోకి వెళ్లేందుకు అనుమతి లభించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, జమ్మూ కాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, సుప్రియా సూలే, ఎం.ఎ. బేబీ, డి. రాజా తదితర అగ్రనేతలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. దేశంలో ఓట్ల దొంగతనం జరుగుతోందని, ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయత కోల్పోయిందని వివరిస్తూ వారు రాష్ట్రపతికి మెమోరాండం సమర్పించారు. సీఈసీ ఆఫీస్ నుంచే ప్రజాస్వామ్యం నాశనమవుతోందని నేతలు రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు.

**ఆధారాలు అడిగిన ద్రౌపది ముర్ము**

రాష్ట్రపతి భవన్ నుంచి బయటకు వచ్చాక విలేకరులతో మాట్లాడిన రాహుల్ గాంధీ, ఖర్గేలు సమావేశం వివరాలను వెల్లడించారు. తాము లేవనెత్తిన అంశాలను రాష్ట్రపతి శ్రద్ధగా విన్నారని, ఆరోపిస్తున్న ఓట్ల చోరీకి సంబంధించిన సాక్ష్యాలను, ఆధారాలను తమకు సమర్పించాలని ఆమె కోరినట్లు తెలిపారు. రాష్ట్రపతి తమ వాదనలను ఖండించలేదని, సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రాష్ట్రపతి కోరిన విధంగా ఓట్ల చోరీకి సంబంధించిన పూర్తి ఆధారాలను సేకరిస్తున్నామని, త్వరలోనే వాటన్నింటినీ ఒక నివేదిక రూపంలో ఆమెకు అందజేస్తామని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు.

**సీజేఐతో కలవనున్న విపక్షాలు**

మరోవైపు సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో జరిగిన ఎంపీల సమావేశంలో రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆరోపించిన అవకతవకలు కేవలం సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కే పరిమితం కాలేదని, దీని వెనుక ప్రధాని మోడీ, అమిత్ షాల కుట్ర ఉందని ఆయన విమర్శించారు. విపక్షాలు ఇదే ఐక్యతతో ఒత్తిడి తెస్తే ఈ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గత 10 నెలల్లో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు సర్ ప్రక్రియపై 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసిన ఆధారాలు ఉన్నాయని విపక్షాలు గుర్తుచేశాయి. ఈ క్రమంలోనే తమ పోరాటాన్ని మరింత ముమ్మరం చేస్తూ, సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)ని కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు రాహుల్ గాంధీ వెల్లడించారు.

# ఉప ఎన్నికల ఫలితాల్లో బీజేపీ హవా

- **పశ్చిమ బెంగాల్‌లోని రెండు అసెంబ్లీ స్థానాల్లో కాషాయ జెండా**
- **అసోం లోక్‌సభ స్థానంలో దేవాశిష్ శర్మ ఘన విజయం**
- **పుదుచ్చేరిలో సత్తా చాటిన ఏఐఎన్ఆర్సీ అభ్యర్థి అశోక్ ఆనంద్**
- **తమిళనాడులో రాజకీయ ప్రకంపనలు రేపుతున్న దళపతి విజయ్ పార్టీ**




**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** తమిళనాడులో 2, పశ్చిమ బెంగాల్‌లో 2, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో 1 అసెంబ్లీ స్థానంతో పాటు అసోంలో 1 లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన నందిగ్రామ్ (210) అసెంబ్లీ స్థానంలో బీజేపీ అభ్యర్థి హాసి రాణి రథ్ 122753 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. రెజీనగర్ (70) నియోజకవర్గంలోనూ బీజేపీ తరఫున పోటీ చేసిన శంఖరవ్ సర్కార్ 75,816 ఓట్ల మెజార్టీతో విజేతగా నిలిచి జయకేతనం ఎగురవేశారు. ఈ రెండు స్థానాల్లోనూ కాషాయ జెండా రెపరెపలాడటంతో పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి.

**అసోం, పుదుచ్చేరిలలో ఎన్డీయే పట్టు**

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని తట్టంచావడి (9) అసెంబ్లీ స్థానంలో ఎన్డీయే అభ్యర్థి, ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ (ఏఐఎన్ఆర్సీ) నేత అశోక్ ఆనంద్ భారీ ఆధిక్యంతో ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు. అసోంలో ఒక లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఎవరూ ఊహించని విధంగా బీజేపీ అభ్యర్థి దేవాశిష్ శర్మ భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ తాజా విజయంతో లోక్‌సభలో బీజేపీ బలం 241కి చేరగా, కాంగ్రెస్ పార్టీ బలం 98కి పడిపోయింది. జాతీయ స్థాయిలో బీజేపీ తన ఆధిపత్యాన్ని మరోసారి నిలబెట్టుకుందని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

**తమిళనాట దళపతి ప్రకంపనలు**

తమిళనాడు రాజకీయాల్లో సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ సరికొత్త ప్రకంపనలు సృష్టిస్తోంది. రాష్ట్రంలోని మదురాంతకం (35) అసెంబ్లీ నియోజకవర్గంలో టీవీకే అభ్యర్థి కె.మరగాథం కుమారవేల్, ధారాపురం (101) నియోజకవర్గంలో సత్యభామ భారీ విజయం సాధించారు. తొలి ఎన్నికల సమరంలోనే రాష్ట్రంలోని ప్రధాన సంప్రదాయ ద్రవిడ పార్టీలైన డీఎంకే, ఏఐఏడీఎంకేలకు గట్టి పోటీ ఇస్తూ రెండు స్థానాల్లోనూ టీవీకే అభ్యర్థులు గెలవడం రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయానికి గురి చేస్తోంది. ఉప ఎన్నికల తాజా ఫలితాలు అటు బెంగాల్‌లో బీజేపీ బలాన్ని చాటడంతో పాటు, తమిళనాడులో సరికొత్త రాజకీయ మార్పులకు నాంది పలుకుతున్నాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# భారత సంతతి మహిళకు నోబెల్ శాంతి పురస్కారం

- **ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది నవనీతం పిళ్లైకి అత్యున్నత గౌరవం**
- **2026 సంవత్సరానికి గాను వరించిన ప్రతిష్టాత్మక బహుమతి**
- **వర్ణవివక్ష వ్యతిరేక ఉద్యమంలో న్యాయవాదిగా సుదీర్ఘ పోరాటం**
- **దక్షిణాఫ్రికాలో లా ప్రాక్టీస్ చేసిన తొలి భారత సంతతి మహిళ**

**ఓస్లో, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** భారత సంతతి మహిళను ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి పురస్కారం వరించింది. దక్షిణాఫ్రికాకు చెందిన ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది నవనీతం (నవి) పిళ్లై 2026 సంవత్సరానికి గాను ఈ అత్యున్నత బహుమతిని గెలుచుకున్నారు. 1941లో డర్బన్‌లోని భారతీయ సంతతి కుటుంబంలో జన్మించిన పిళ్లై అపార్థ్‌హైడ్ (జాతి వివక్ష) పాలనలోనే పెరిగి పెద్దయ్యారు. ఆ క్లిష్ట పరిస్థితులను సైతం అధిగమించి దక్షిణాఫ్రికాలో లా ప్రాక్టీస్ చేసిన తొలి భారతీయ సంతతి మహిళల్లో ఒకరిగా ఆమె నాడు చరిత్ర సృష్టించారు. తన వృత్తిపరమైన ప్రస్థానంలో ఆమె వర్ణవివక్ష వ్యతిరేక పోరాటకర్తల తరఫున వాదించడంతో పాటు ఖైదీల పట్ల జరిగే వివక్షాపూరిత విధానాలకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేశారు.

**చారిత్రాత్మక తీర్పుల్లో కీలక పాత్ర**

దక్షిణాఫ్రికాలో వర్ణవివక్ష ముగిసిన తర్వాత ఆమె రువాండా అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్‌లో న్యాయమూర్తిగా సేవలు అందించారు. ఆ సమయంలో లైంగిక దాడిని జాతిసంహారం చర్యగా గుర్తించే చారిత్రాత్మక చట్టపరమైన తీర్పును వెలువరించడంలో పిళ్లై ఎంతో కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత ఆమె అంతర్జాతీయ నేరాల న్యాయస్థానం (ఐసీసీ) న్యాయమూర్తిగా కూడా సమర్థవంతంగా విధులు నిర్వహించారు.

**ఐరాస హైకమిషనర్‌గా విశేష సేవలు**

2008 నుండి 2014 వరకు ఐక్యరాజ్యసమితి (ఐరాస) మానవ హక్కుల హైకమిషనర్‌గా ఆమె విశేష సేవలు అందించారు. ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణకు ఆమె చేసిన కృషికి గాను అంతర్జాతీయ స్థాయిలో విశేష గుర్తింపు లభించింది. ఇటీవల కాలంలో



ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రాంతాలలో జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనలపై విచారణ జరిపిన ఐరాస కమిషన్‌కు సైతం ఆమె అధ్యక్షత వహించారు. దశాబ్దాల పాటు నిరంతరంగా న్యాయం కోసం, మానవ హక్కుల కోసం ఆమె చేసిన పోరాటానికి గుర్తింపుగా తాజాగా ఈ నోబెల్ శాంతి పురస్కారం లభించింది.

స్పందన
శనివారం, 10 అక్టోబర్ 2026

## బీసీలకు 34 శాతం సీట్ల కేటాయింపు నిర్ణయం

# టీడీపీ చిత్తశుద్ధికి నిదర్శనం

పెదకూరపాడు అక్టోబర్ 9 (స్పంద )బీసీలకు 34 శాతం సీట్ల కేటాయింపు నిర్ణయం  టీడీపీ చిత్తశుద్ధికి నిదర్శనం సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే బీసీలకు అండగా చంద్రబాబు, లోకేశ్ నిర్ణయం అభినందనీయం జగన్ అడ్డంకులను అధిగమించి బీసీల రాజకీయ సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబాటు రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి విజయదుందుభి ఖాయం: అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ )జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అమరావతి: బీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే, తెలుగుదేశం పార్టీ తరఫున 34 శాతం సీట్లను బీసీలకు కేటాయిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ప్రకటించడం శుభపరిణామమని  అఖిలభారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు  డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. ఈ నిర్ణయం బీసీల పట్ల తెలుగుదేశం పార్టీకి ఉన్న చిత్తశుద్ధికి, బలహీనవర్గాల రాజకీయ సాధికారత పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. బీసీలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యం కల్పించడం, వారి హక్కులను పరిరక్షించడం తెలుగుదేశం పార్టీ విధానంలో భాగమని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, నారా లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో కూటమి ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి కట్టుబడి ఉండటం అభినందనీ యమన్నారు. బీసీల



రాజకీయ ప్రాతినిధ్యానికి టీడీపీ చారిత్రక నిర్ణయాలు ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ గతంలో కీలక నిర్ణయాలు తీసుకుందని జాస్తి వీరాంజనేయులు గుర్తుచేశారు. బీసీలకు రిజర్వేషన్ల ద్వారా రాజకీయ అవకాశాలు కల్పించడం, వారి సామాజిక అభివృద్ధికి తోడ్పడటం పార్టీ చరిత్రలో ముఖ్యమైన అంశాలని పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతి విషయంలో టీడీపీ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ విషయంలో గత వైకాపా ప్రభుత్వ వైఖరిపై బీసీ వర్గాల్లో అసంతృప్తి ఉందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూనే, బీసీలకు న్యాయం జరిగేలా రాజకీయంగా  తెలుగుదేశం పార్టీ తరఫున 34 శాతం సీట్లను కేటాయిస్తామని ప్రకటించడం ద్వారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ బీసీలకు భరోసా కల్పించిందని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో కూటమి విజయదుందుభి ఖాయం బీసీల రాజకీయ సాధికారతే నిజమైన సామాజిక న్యాయానికి పునాది అని డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. బీసీలకు గౌరవప్రదమైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలో వారి భాగస్వామ్యం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సూపర్ సిక్స్,  బీసీల సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయదుందుభి మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీసీల హక్కుల పరిరక్షణ, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం అనే లక్ష్యాల సాధనకు తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేయాలని డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఆకాంక్షించారు.

# ప్రజాస్వామ్యంపై వైసీపీ అణచివేత ధోరణి..!

**ప్రాథమిక హక్కులను హరించి..**

**రాజ్యాంగం కూనీ..!**

**మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మోందనందరెడ్డి**



దుర్గి అక్టోబర్ 09 ( స్పంద న్యూస్) ప్రజాస్వామ్యంపై వైసీపీ అణచివేత ధోరణిని రాష్ట్ర ప్రజలు మరవరని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం మండల పరిధిలోని పర్యటించిన ఆయన, మీ భూమి.., మీ హక్కు పథకం ద్వారా రీ సర్వే లో ప్రభుత్వం మంజూరు చేసిన రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు అందజేశారు. ముందుగా రాజానగరం గ్రామంలో రెవిన్యూ శాఖ అధికారులు నిర్వహించిన నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో 1215 పాసుపుస్తకాలను రైతులకు అందజేశారు. అనంతరం దుర్గి మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి వారి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 1426 నూతన పట్టాదారు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే రైతులకు అందజేశారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.., ప్రజలు వేసిన ఒక్క ఓటుతో ప్రజాప్రభుత్వం ఎన్నో ప్రయోజనకరమైన కార్యక్రమాలను చేపట్టిందని వివరించారు. ఒక్క ఓటు సంక్షేమాన్ని ఇంటికి నడిపించింది.., వీధుల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించింది.., పచ్చని గ్రామాల్లో శాంతిని నెలకొల్పింది.., పట్టణాల్లో రౌడీలను తరిమికొట్టింది.., రక్తసిక్తంగా మారి వ్యవస్థను మార్చి.., అహింసా మార్గంలో ప్రగతిని సాధిస్తోంది.., విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టి పెట్టుబడులు తెచ్చి.., ఉపాధి, ఉద్యోగావకాశాలను అందిస్తోందని జూలకంటి పునరుద్ఘాటించారు. జగన్ రెడ్డి దోపిడికి కాదేది అనర్హం అన్నట్లు ల్యాండ్, శ్యాండ్, మైన్, వైన్ వ్యవహారంలో వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్, అమృత్ స్కీం ద్వారా తాగునీటి ప్రాజెక్టులు శరవేగంగా నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. త్వరలో వరకిపూడిశెల నిర్మాణ పనులకు భూమిపూజ జరుగుతోందని ధీమా వ్యక్తం చేశారు. కులాలు మతాలు మధ్య చిచ్చుపెట్టి, వేడుక చూడడం మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి పరిపాటిగా మారిందని దుయ్యపట్టారు. ప్రాథమిక హక్కులను హరించి.. రాజ్యాంగం కూనీ చేసిన వైసీపీని స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. రాష్ట్రంలో చంద్రబాబు, మాచర్ల నియోజకవర్గం తాను ప్రగతి కోసం పాటుపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు నిమ్మల శ్రీనివాసరావు, కూటమి పార్టీల నాయకులు యాగంటి మల్లికార్జున రావు, లింగా బ్రహ్మయ్య, మునిగోటి సత్యనారాయణ, జానికీ రామయ్య, పులి హరి, రుద్రాల రవి, తోటకూర శ్రీనివాసరావు,జక్కా రమేష్, వలి, ఆదినారాయణ, హనుమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎం శ్రీ మున్సిపల్ హైస్కూల్‌లో

# ప్రపంచ మానసిక ఆరోగ్యంపై అవగాహన

బాపట్ల: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు బాపట్లలోని పీఎం శ్రీ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ గారు, జీసీడీఓ చారులత గారు మున్సిపల్ హై కూల్ హెచ్‌ఎం రాజశ్రీ,  బాపట్ల జిల్లా డిస్ట్రిక్ట్ కెరియర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్స్ అయిన కె రామకృష్ణారెడ్డి,టి కళ్యాణ్, రాగాల  జవహర్, జీ నాగలక్ష్మి, కే ఇందిర, ఎం సౌజన్య, బి సౌందర్య, టి రవీంద్రబాబు, జ్యోతిర్మయి  పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యత, భావోద్వేగాలను నియంత్రించుకోవడం, ఒత్తిడిని అధిగమించడం, సానుకూల ఆలోచనలు అలవర్చుకోవడం, సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మానసిక సమస్యలు ఎదురైనప్పుడు వాటిని దాచుకోకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా కౌన్సిలర్ల సహాయం తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతరులతో తమ భావాలను పంచుకుంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్నవారు సూచించారు. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు.




# స్థానిక ఎన్నికల దృష్ట్యా పెట్రోల్, డీజిల్ అమ్మకాల పై ఆంక్షలు

దాచేపల్లి, అక్టోబరు 9(స్పంద న్యూస్ ). స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా దాచేపల్లి పట్టణం తో పాటు మండల పరిధిలో ఉన్న పెట్రోల్ బంక్ లకు పోలీసులు అంక్షలు విధించారు. పెట్రోల్ బంక్ ల్లో క్యాన్లు, బాటిళ్ళ కు విడిగా పెట్రోల్, డీజిల్ పోయవద్దని అన్ని పెట్రోల్ బంక్ లకు ఈ మేరకు సర్క్యులర్ జారీచేశారు. వ్యవసాయ పనులకు సంబందించి ఏవరైనా క్యాన్లు, బాటిళ్ళ కు పెట్రోల్, డీజిల్ కావాలంటే పోలీసు స్టేషన్ లో అనుమతి పత్రం తీసుకోవాలని సూచించారు. మండలం గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన ఘటనల నేపథ్యం లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్క్యులర్ జారీ చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు. ఏవరైనా మా ఆదేశాలు ధిక్కరించి క్యాన్లు, బాటిళ్ళ కు విడిగా పెట్రోల్, డీజిల్ పోస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



### ఇబ్బందులు పడుతున్న రైతులు.

క్యాన్లు, బాటిళ్ళ కు విడిగా పెట్రోల్, డీజిల్ పోయవద్దన్న పోలీసుల ఆదేశాల వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భంగా సిపిఐ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ సమయంలో రైతులకు తైవాన్ స్ప్రేయర్ల కు అవసరమని, ఒక తైవాన్ స్ప్రేయర్ ట్యాంక్ లో ఒక్క అరలీటర్ మాత్రమే పడుతుందని, అది అయిపోతేనే మళ్ళీ పోయాల్సి ఉంటుందని, రెండు రోజులకొకసారి మందు కొట్టాల్సి ఉంటుందని, ఈ క్రమంలో ఇళ్ల పక్కనోళ్ళు, తెలిసినవారు ఏవరైనా వెళు తుంటే వారికొక బాటిల్ ఇచ్చి తెప్పించుకుంటారని, ఇప్పుడు ఖచ్చితంగా రైతే పోలీస్ స్టేషన్ కు వెళ్లి అనుమతి పత్రం తీసుకొని పెట్రోల్ పోయించుకొని రావాల్సి వస్తుందని దీని వలన రైతులకు ఇబ్బంది అవుతుందని, రైతులకు మినహాయింపు ఇవ్వాలని ఈ మేరకు సిపిఐ నాయకులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

## శ్రీ లక్ష్మీ అమ్మవారి సేవలో జూలకంటి

## శరన్నవరాత్రుల ఉత్సవాలపై సమీక్ష

దుర్గి అక్టోబర్ 09 (స్పందన్యూస్) అడిగొప్పల శ్రీ నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారిని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం రానున్న దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలను ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు లింగా బ్రహ్మయ్య,మునిగోటి సత్యానారాయణ, యాగంటి వెంకటేశ్వర్లు, గరిణే రమేష్, యాగంటి నరేష్, కొమెరా దుర్గారావు, జక్కా రమేష్, వలి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



## బీసీ సంఘ నాయకుల ఆధ్వర్యంలో మాన్యశ్రీ కాన్షీరామ్ 20వ వర్ధంతి నివాళులు



సత్తెనపల్లి,అక్టోబర్ 9(స్పంద): సత్తెనపల్లి పట్టణంలోని ఎన్జీవో సెంటర్లో బీసీ సంఘ నాయకులు వేముల ప్రసాద్ రావు ఆధ్వర్యంలో మాన్యశ్రీ కాన్షీరామ్ 20వ వర్ధంతి సందర్భంగా పూలమాలవేసి  ఘనంగా నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా బీసీ సంఘ నాయకులు మాట్లాడుతూ ఒక ఓటు,ఒక నోటు అనే నినాదంతో బహుజనులకు అధికారం సాధించిన మహోన్నత వ్యక్తి కాన్షీరామ్ అని కొనియాడారు. కుల వ్యవస్థ వల్ల కొనసాగుతున్న సహజ అసమానతలను తొలగించడం కోసం కృషిచేసిన మహనీయుడు కాన్షీరామ్ అని గుర్తు చేశారు. దేశంలో ఓబీసీల రిజర్వేషన్ కోసం మండల కమిషన్ సిఫారస్ మేరకు 40శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఢిల్లీలో 45 రోజులు దీక్ష చేసిన వ్యక్తి కాన్షీరామ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి హరే కృష్ణ,చింకా అంకమ్మరావు,పులహరి బానోజీ,కుమ్మరి దస్తగిరి, పిక్కిలి శివ,షేక్ చిన్న షరీఫ్, బడిగంచుల మస్తాన్ రావు, గుంటూరు గోవిందు,వీరాటం సైదారావు,గొట్టం వెంకటేష్, యర్రగొర్ల శ్రీనివాస్,షేక్ కరిముల్లా,టైపు ఇన్స్టిట్యూట్ వెంకటేశ్వరరావు,చావల వెంకటేశ్వర్లు,సాకి శ్రీనివాసరావు,పిక్కిలి రత్తయ్య,మంగళపూరి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో కోహాన్స్ లైఫ్ సైన్సెస్ క్యాంపస్ డ్రైవ్ విజయవంతం



నరసరావుపేట, అక్టోబర్ 09 (స్పంద న్యూస్): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ప్రముఖ ఫార్మా సంస్థ 'కోహాన్స్ లైఫ్ సైన్సెస్' ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ విజయవంతంగా ముగిసింది. ఈ ఎంపిక ప్రక్రియలో వివిధ విభాగాలకు చెందిన 8మంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం వెల్లడించింది. సంస్థ హెచ్‌ఆర్ ప్రతినిధులు పి.వంశీధర్ రెడ్డి, సుబ్రమణ్య దత్తా విద్యార్థులకు మూడు దశల్లో సమగ్ర ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేశారు. ఈ ఎంపికల్లో బీఎస్సీ విద్యార్థులకు నెలకు ?25,000 చొప్పున, ఐటీఐ మరియు డిప్లొమా విద్యార్థులకు నెలకు ?18,000 చొప్పున వేతనం లభించనుంది. ఎంపికైన విద్యార్థులు ఈ నెలాఖరు నుంచే విధుల్లో చేరనున్నారని ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు డా.నాతాని వెంకటేశ్వర్లు, అకడమిక్ డైరెక్టర్ యోగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ సతీష్ బాబు ఎంపికైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి

**నారాయణ స్కూల్‌లో ఘనంగా ముందస్తు దసరా వేడుకలు**



నరసరావుపేట, అక్టోబర్ 09 (స్పంద న్యూస్): స్థానిక రామిరెడ్డిపేటలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ముందస్తు దసరా సంబరాలు అంబరాన్నంటాయి. పండుగ వాతావరణాన్ని తలపించేలా విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో చేసిన నృత్యాలు, ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ షేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో దసరా పండుగకు అత్యంత విశిష్టమైన స్థానం ఉందన్నారు. ఆశ్వయుజ మాసంలో తొమ్మిది రోజుల పాటు దుర్గాదేవిని నవరాత్రులలో అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించి, పదో రోజున విజయదశమిని జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆచారమని గుర్తుచేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ఈ పండుగ ప్రతీక అని, విద్యార్థులు కూడా సన్మార్గంలో పయనిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో పాఠశాల ఆర్ అండ్ డీ హెడ్‌లు స్వాతి లక్ష్మి, మారియా పాట్రిక్, క్లస్టర్ ప్రిన్సిపల్ బెల్లంకొండ భాగ్యరాణి, జెడ్‌సీఓలు షేక్ గౌసియా, షేక్ రిహాని, వైస్ ప్రిన్సిపాళ్లు సరోజిని, ధనలక్ష్మిలతో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

కొల్లూరు,అక్టోబర్ 9(స్పంద న్యూస్):జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీడబ్ల్యూజే వేమూరు నియోజకవర్గ జర్నలిస్టులు శుక్రవారం పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కు వినతి పత్రం అందజేశారు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, హెల్త్ కార్డులు రెన్యువల్ చేయాలని, జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల్లో ముద్దాయిలపై కేసులు నమోదు చేయాలని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు, కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం నాయకులు సుబ్బారావు, రవిబాబు, సునీల్, విజయ్, ప్రదీప్, సోమయ్య, బాలాజీ తదితరులు ఉన్నారు.



ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
శనివారం, 10 అక్టోబర్ 2026

# ఏమి ఆట భయ్యా.. కొట్టుడే కొట్టుడు!

## విండీస్ బౌలర్లకు చుక్కలు చూపించిన భారత బ్యాటర్లు

- రెండో టీ20లో టీమిండియా పరుగుల సునామీ
- 20 ఓవర్లలో 5 వికెట్లకు 249 భారీ స్కోరు
- సిక్సర్ల వర్షం కురిపించిన సంజూ శాంసన్.. 41 బంతుల్లో 82 పరుగులు
- ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ మెరుపు ఇన్నింగ్స్‌లు
- టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న విండీస్‌కు చుక్కెదురు




**రాంచీ, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** ఒకరు కొడితే మరొకరు అంతకుమించి బాదేశారు. ఫోర్లతో మొదలుపెట్టి సిక్సర్లతో విరుచుకుపడ్డారు. బంతి ఎక్కడ వేసినా బౌండరీ దాటించడమే లక్ష్యంగా భారత బ్యాటర్లు చెలరేగిపోయారు. వెస్టిండీస్ బౌలర్లకు ఊపిరి సలపనివ్వకుండా పరుగుల వర్షం కురిపించారు. రాంచీలోని జేఎస్‌సీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో టీమిండియా బ్యాటర్లు విధ్వంసం సృష్టించారు. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న వెస్టిండీస్ నిర్ణయాన్ని తలకిందులు చేస్తూ భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 249 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ సంజూ శాంసన్ సిక్సర్లతో స్టేడియాన్ని హోరెత్తించగా, ఇషాన్ కిషన్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ మెరుపు బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తించారు. బ్యాటర్ల దూకుడుతో రాంచీ స్టేడియం పరుగుల పండుగకు వేదికైంది.

### సంజూ సిక్సర్ల సునామీ!

భారత ఇన్నింగ్స్‌లో సంజూ శాంసన్ బ్యాటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన సంజూ వెస్టిండీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కేవలం 41 బంతుల్లో నాలుగు ఫోర్లు, తొమ్మిది సిక్సర్లతో 82 పరుగులు సాధించాడు. మైదానం నలుమూలలా భారీ షాట్లు ఆడుతూ ప్రేక్షకులను ఉర్రూతలూగించాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ 20 పరుగులకే వెనుదిరిగినప్పటికీ సంజూ తన జోరును కొనసాగించాడు. బౌలర్లు మారుతున్నా అతడి బ్యాటింగ్ తీరు మాత్రం మారలేదు. బంతిని బౌండరీ దాటించడమే లక్ష్యంగా ఆడిన సంజూ భారత భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు.

### ఇషాన్ కిషన్ మెరుపులు

సంజూ శాంసన్‌కు ఇషాన్ కిషన్ నుంచి అద్భుతమైన సహకారం లభించింది. క్రీజులోకి వచ్చినప్పటి నుంచే దూకుడుగా ఆడిన ఇషాన్ కేవలం 22 బంతుల్లో రెండు ఫోర్లు, ఆరు సిక్సర్లతో 43 పరుగులు సాధించాడు. వెస్టిండీస్ బౌలర్లపై విరుచుకుపడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. సంజూ, ఇషాన్ బ్యాటింగ్ ధాటికి ప్రత్యర్థి జట్టు బౌలింగ్ వ్యూహాలు ఫలించలేదు. వీరిద్దరూ బౌండరీలతో విరుచుకుపడటంతో భారత జట్టు భారీ స్కోరు దిశగా దూసుకెళ్లింది.

### కెప్టెన్ శ్రేయస్ ఊచకోత!

భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా తనదైన శైలిలో చెలరేగిపోయాడు. కేవలం 18 బంతుల్లో ఒక ఫోర్, మూడు సిక్సర్లతో 40 పరుగులు సాధించాడు. తక్కువ బంతుల్లోనే భారీ పరుగులు రాబడుతూ జట్టు స్కోరును మరింత పెంచాడు. వెస్టిండీస్ బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. కీలక సమయంలో కెప్టెన్ ఆడిన మెరుపు ఇన్నింగ్స్ భారత జట్టు భారీ స్కోరు సాధించడంలో ముఖ్యపాత్ర పోషించింది.

### చివర్లో తిలక్ విధ్వంసం!

ఇన్నింగ్స్ చివరి ఓవర్లలో తిలక్ వర్మ బ్యాట్ ఝుళిపించాడు. కేవలం 18 బంతుల్లోనే 44 పరుగులు చేసి భారత స్కోరును మరింత పెంచాడు. చివరి ఓవర్లలో వెస్టిండీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగిన తిలక్ వరుసగా పరుగులు రాబట్టాడు. చివరి బంతికి నమన్ ధీర్ ఫోర్ బాదడంతో భారత ఇన్నింగ్స్ ఘనంగా ముగిసింది. అదనంగా తొమ్మిది పరుగులు రావడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 249 పరుగులు సాధించింది.

### వికెట్లు తీసినా ఆగని పరుగుల ప్రవాహం

వెస్టిండీస్ బౌలర్లలో రోస్టన్ చేజ్ మూడు వికెట్లు పడగొట్టగా, షామర్ స్ప్రింగర్ రెండు వికెట్లు సాధించాడు. అయినప్పటికీ భారత బ్యాటర్ల పరుగుల ప్రవాహాన్ని అడ్డుకోలేకపోయారు. ఒక బ్యాటర్ ఔటైనా మరో బ్యాటర్ అదే దూకుడును కొనసాగించడంతో వెస్టిండీస్ బౌలర్లకు ఊరట లభించలేదు. భారీ స్కోరుతో ప్రత్యర్థికి టీమిండియా సవాల్ విసిరింది. విజయానికి వెస్టిండీస్ 250 పరుగులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



# ఆర్కిటిక్ ఓపెన్‌లో సింధు జోరు!

## క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లిన తెలుగు తేజం

## జపాన్ షట్లర్ రికో గుంజిపై వరుస గేముల్లో విజయం

## తొలి రౌండ్‌లోనే శ్రీకాంత్, తన్వి శర్మకు నిరాశ

**వంతా (ఫిన్లాండ్), అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** ఆర్కిటిక్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధు సత్తా చాటింది. మహిళల సింగిల్స్‌లో అద్భుత ప్రదర్శనతో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. జపాన్‌కు చెందిన రికో గుంజిపై 21-15, 21-15 తేడాతో వరుస గేముల్లో విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన సింధు ప్రత్యర్థికి పుంజుకునే అవకాశం ఇవ్వలేదు. రెండు గేముల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. మరోవైపు భారత షట్లర్లు కిదాంబి శ్రీకాంత్, యువ క్రీడాకారిణి తన్వి శర్మ తొలి రౌండ్‌లోనే ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు.

### శ్రీకాంత్‌కు చుక్కెదురు

పురుషుల సింగిల్స్‌లో తెలుగు షట్లర్ కిదాంబి శ్రీకాంత్‌కు నిరాశ ఎదురైంది. కెనడాకు చెందిన బ్రియాన్ యాంగ్‌తో జరిగిన పోరులో 21-15, 15-21, 13-21 తేడాతో ఓటమిపాలయ్యాడు. తొలి గేమ్‌ను గెలుచుకుని శుభారంభం చేసిన శ్రీకాంత్ ఆ తర్వాత అదే జోరును కొనసాగించలేకపోయాడు. రెండో గేమ్‌లో పుంజుకున్న బ్రియాన్ యాంగ్ నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ ఆధిపత్యం ప్రదర్శించి విజయాన్ని అందుకున్నాడు.

### తన్వి శర్మ పోరాటానికి తెర

మహిళల సింగిల్స్‌లో యువ సంచలనం తన్వి శర్మ కూడా తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టింది. థాయ్‌లాండ్‌కు చెందిన రచనోక్ ఇంతనోన్ చేతిలో 18-21, 7-21 తేడాతో ఓటమి చవిచూసింది. తొలి గేమ్‌లో పోటీనిచ్చిన తన్వి రెండో గేమ్‌లో ప్రత్యర్థి దూకుడును అడ్డుకోలేకపోయింది. దీంతో భారత శిబిరానికి నిరాశ ఎదురైంది. ఈ నేపథ్యంలో క్వార్టర్ ఫైనల్‌కు చేరిన సింధుపైనే భారత అభిమానులు ఆశలు పెట్టుకున్నారు.



# రష్యా దెబ్బకు భారత్ విలవిల!

## మహిళల ఫుట్‌బాల్‌లో భారత జట్టుకు ఘోర పరాజయం

**కోల్‌కతా, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** రష్యాతో రెండు స్నేహపూర్వక మ్యాచ్‌ల సిరీస్‌ను భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు ఓటమితో ప్రారంభించింది. గురువారం జరిగిన తొలి పోరులో ప్రపంచ 27వ ర్యాంకర్ రష్యా చేతిలో భారత్ 4--0 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. మ్యాచ్ తొలి అర్ధభాగంలో ప్రత్యర్థికి గట్టి పోటీనిచ్చిన భారత క్రీడాకారిణులు రెండో అర్ధభాగంలో మాత్రం ఆ జోరును కొనసాగించలేకపోయారు. భారత రక్షణ శ్రేణిలో తలెత్తిన లోపాలను సద్వినియోగం చేసుకున్న రష్యా వరుస గోల్స్‌తో ఆధిపత్యం ప్రదర్శించింది. పటిష్ఠమైన రష్యా జట్టును ఎదుర్కొన్న భారత మహిళలు ఆరంభంలో సమర్థంగా పోరాడారు. ప్రత్యర్థి దాడులను అడ్డుకుంటూ మ్యాచ్‌పై పట్టు సాధించేందుకు ప్రయత్నించారు. అయితే రెండో అర్ధభాగంలో రష్యా దూకుడు పెంచడంతో భారత జట్టు ఒత్తిడికి గురైంది. వరుస దాడులతో భారత రక్షణ శ్రేణిని ఛేదించిన రష్యా గోల్స్ సాధించి విజయాన్ని ఖాయం చేసుకుంది. రష్యా విజయానికి పెతుఖోవా కీలకంగా నిలిచింది. రెండు గోల్స్ సాధించి భారత జట్టును దెబ్బతీసింది. రష్యా ఆటగాళ్ల మధ్య సమన్వయం, వేగవంతమైన దాడులు భారత జట్టుకు సవాల్‌గా మారాయి. చివరి వరకు పుంజుకునేందుకు భారత క్రీడాకారిణులు ప్రయత్నించినప్పటికీ గోల్ సాధించలేకపోయారు. దీంతో రష్యా నాలుగు గోల్స్ ఆధిక్యంతో మ్యాచ్‌ను ముగించింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా భారత్, రష్యా జట్లు అక్టోబర్ 11న మరోసారి తలపడనున్నాయి. తొలి మ్యాచ్‌లో ఎదురైన పరాజయం నుంచి పాఠాలు నేర్చుకుని రెండో పోరులో మెరుగైన ప్రదర్శన చేయాలని భారత జట్టు భావిస్తోంది. ముఖ్యంగా రక్షణ విభాగాన్ని పటిష్ఠం చేసుకోవడంతోపాటు గోల్స్ సాధించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం భారత్‌కు కీలకం కానుంది. రెండో మ్యాచ్‌లోనైనా రష్యాకు గట్టి పోటీనిచ్చి సత్తా చాటాలని భారత మహిళల జట్టు లక్ష్యంగా పెట్టుకుంది.

# టోర్నీకి ముందే పాక్ ఔట్!

- ఆసియా ఛాంపియన్స్ హాకీ ట్రోఫీ నుంచి పాకిస్థాన్ వైదొలగినట్లు కథనం
- తటస్థ వేదికపై మ్యాచ్ నిర్వహించాలన్న పాక్ హాకీ సమాఖ్య
- హైబ్రిడ్ విధానానికి అంగీకరించని నిర్వాహకులు
- అక్టోబర్ 27న జరగాల్సిన భారత్--పాక్ పోరుకు అడ్డంకి
- పాకిస్థాన్ స్థానంలో బంగ్లాదేశ్‌కు అవకాశం లభించినట్లు సమాచారం
- పంజాబ్‌లోని జలంధర్, మొహాలీ వేదికలుగా పోటీలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (స్పంద న్యూస్):** ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నమెంట్ ప్రారంభానికి ముందే పాకిస్థాన్ జట్టు పోటీ నుంచి తప్పుకుంది. భారత్‌లో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు తటస్థ వేదిక ఏర్పాటు చేయాలన్న తమ ప్రతిపాదనను నిర్వాహకులు తిరస్కరించడంతో పాకిస్థాన్ హాకీ సమాఖ్య ఈ నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 5 వరకు పంజాబ్‌లోని జలంధర్, మొహాలీ నగరాల్లో జరగనున్న ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో పాకిస్థాన్ స్థానంలో బంగ్లాదేశ్‌కు అవకాశం కల్పించారు. ఈ మేరకు ఆసియా హాకీ సమాఖ్య శుక్రవారం సవరించిన మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ప్రకటించింది. దీంతో హాకీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్-పాకిస్థాన్ పోరుకు తెరపడింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత జట్టు ఇప్పుడు బంగ్లాదేశ్‌తో తన తొలి మ్యాచ్ ఆడనుంది.

### తటస్థ వేదికపై పాక్ పట్టు

భారత్, పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న రాజకీయ, దౌత్యపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో తమ జట్టును భారత్‌కు పంపడం సాధ్యం కాదని పాకిస్థాన్ హాకీ సమాఖ్య పేర్కొంది. ఆటగాళ్లు, అధికారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని టోర్నమెంట్‌ను మరో దేశానికి తరలించాలని లేదా కనీసం పాకిస్థాన్ ఆడే మ్యాచ్‌లను తటస్థ వేదికపై నిర్వహించాలని ఆసియా హాకీ సమాఖ్యను కోరింది. సెప్టెంబర్ 16న ఈ మేరకు అధికారికంగా ప్రతిపాదన పంపింది. అయితే ముందుగా నిర్ణయించిన వేదికల్లోనే పోటీలు జరుగుతాయని హాకీ ఇండియా, ఆసియా హాకీ సమాఖ్య స్పష్టం చేశాయి. పాకిస్థాన్ ప్రతిపాదనను అంగీకరించకపోవడంతో టోర్నమెంట్ నుంచి వైదొలుగుతున్నట్లు ఆ దేశ హాకీ సమాఖ్య ప్రకటించింది.



### పాక్ స్థానంలో బంగ్లాదేశ్‌కు అవకాశం

పాకిస్థాన్ తప్పుకోవడంతో ఖాళీ అయిన స్థానాన్ని బంగ్లాదేశ్‌తో భర్తీ చేశారు. తొలుత బంగ్లాదేశ్, ఒమన్ జట్లను ప్రత్యామ్నాయ జట్లుగా గుర్తించిన ఆసియా హాకీ సమాఖ్య, పాక్ నిర్ణయం అనంతరం బంగ్లాదేశ్‌కు ఆహ్వానం పంపింది. ఆ దేశ హాకీ సమాఖ్య అంగీకరించడంతో సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం భారత్, బంగ్లాదేశ్, చైనా, జపాన్, మలేషియా, దక్షిణకొరియా జట్లు టోర్నమెంట్‌లో పాల్గొననున్నాయి. ఆరు జట్లు లీగ్ దశలో ఒక్కో ప్రత్యర్థితో తలపడతాయి. అత్యధిక పాయింట్లు సాధించిన నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

### అక్టోబర్ 27న బంగ్లాదేశ్‌తో భారత్ తొలి పోరు

సవరించిన షెడ్యూల్ ప్రకారం భారత జట్టు అక్టోబర్ 27న బంగ్లాదేశ్‌తో తన తొలి మ్యాచ్ ఆడనుంది. అనంతరం అక్టోబర్ 29న చైనా, 30న జపాన్, నవంబర్ 1న మలేషియా, నవంబర్ 2న దక్షిణకొరియాతో తలపడుతుంది. భారత జట్టు లీగ్ మ్యాచ్‌లన్నీ సాయంత్రం ఏడు గంటలకు ప్రారంభమవుతాయి. తొలుత నవంబర్ 1న జరగాల్సిన భారత్-పాకిస్థాన్ మ్యాచ్ స్థానంలో భారత్-మలేషియా పోరును నిర్వహించనున్నారు. దీంతో దాయాదుల మధ్య మరో ఆసక్తికర హాకీ సమరాన్ని చూడాలనుకున్న అభిమానులకు నిరాశ ఎదురైంది.

### రెండు నగరాల్లో హాకీ సందడి

పంజాబ్‌లోని జలంధర్, మొహాలీ నగరాలు ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి. జలంధర్‌లోని ఒలింపియన్ సుర్జిత్ సింగ్ హాకీ స్టేడియంలో అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2 వరకు లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కూడా అక్కడే నిర్వహించనున్నారు. అనంతరం పోటీలు మొహాలీలోని ఒలింపియన్ బల్బీర్ సింగ్ సీనియర్ అంతర్జాతీయ హాకీ స్టేడియానికి మారనున్నాయి. నవంబర్ 4న సెమీఫైనల్స్, నవంబర్ 5న కాంస్య పతక పోరు, ఫైనల్ నిర్వహించనున్నారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత పంజాబ్‌లో పెద్ద అంతర్జాతీయ హాకీ టోర్నమెంట్ జరగనుండటంతో ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

### మరో టైటిల్‌పై భారత్ గురి

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత జట్టు మరోసారి టైటిల్‌ను దక్కించుకోవడమే లక్ష్యంగా సిద్ధమవుతోంది. ఇటీవల జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో మలేషియాను ఓడించి స్వర్ణ పతకం సాధించిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేన మంచి ఆత్మవిశ్వాసంతో ఉంది. ఆసియా క్రీడల సెమీఫైనల్లో పాకిస్థాన్‌ను 4-3 గోల్స్ తేడాతో ఓడించిన భారత్, ఫైనల్లో మలేషియాపై 5-1తో విజయం సాధించింది. అదే జోరును స్వదేశంలో జరిగే ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలోనూ కొనసాగించాలని భావిస్తోంది. పాకిస్థాన్ వైదొలగడంతో టోర్నమెంట్ సమీకరణాలు మారినప్పటికీ మిగిలిన ఐదు జట్ల నుంచి భారత్‌కు గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక





# ఆత్మవిశ్వాసమే ముఖ్యం!

## సామాజిక మాధ్యమాల ట్రోలింగ్‌పై కత్రినా కైఫ్ ఘాటు స్పందన

ముంబై, అక్టోబర్ 9 (స్పంద న్యూస్): ఆన్‌లైన్ వేదికల్లో వచ్చే ప్రతికూల విమర్శలు, ట్రోలింగ్‌కు భయపడితే జీవితంలో ముందుకు సాగలేమని ప్రముఖ బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో ఎదురయ్యే వ్యతిరేక వ్యాఖ్యలు మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయకుండా చూసుకోవాలని హితవు పలికారు. లండన్‌లో తన సొంత సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. గతేడాది నవంబరులో మగబిడ్డకు జన్మనిచ్చిన కత్రినా కైఫ్, ప్రసవానంతరం ముంబైలో జరిగిన ఒక బహిరంగ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సమయంలో ఆమె శరీరాకృతిపై (బాడీ షేమింగ్) కొందరు నెటిజన్లు సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ పరిణామంపై స్పందించిన కత్రినా.. ప్రసవం తర్వాత మహిళల శరీరంలో మార్పులు సహజమని, ప్రతి ఒక్కరి అభిప్రాయాలను పట్టించుకుంటూ పోతే మన జీవితానికి సంబంధించిన నిర్ణయాలు సరిగ్గా తీసుకోలేమని వ్యాఖ్యానించారు. ఇతరుల విమర్శలకు ప్రతిసారీ స్పందిస్తూ ఉంటే భయంతో ముందడుగు వేయలేని పరిస్థితి ఏర్పడుతుందని, కొన్నిసార్లు ప్రపంచం మనల్ని ప్రశంసిస్తే, మరికొన్నిసార్లు మనకు మనమే ధైర్యం చెప్పుకోవాల్సి వస్తుందని ఆమె పేర్కొన్నారు. వ్యక్తిగత జీవితంలో మార్పులు వచ్చినా ఇతరుల వ్యాఖ్యలకు వెరవకుండా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలంటూ కత్రినా ఇచ్చిన సందేశం ప్రస్తుతం చలనచిత్ర వర్గాల్లోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ విస్తృతంగా చర్చనీయాంశమైంది.



# పెళ్లిపై మంచి అబ్బాయి దొరికితే త్వరలోనే వివాహం!

## సుప్రీత ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబర్ 9 (స్పంద న్యూస్): టాలీవుడ్ నటి సురేఖ వాణి కుమార్తె, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ సుప్రీత నాయుడు తన వివాహం, వ్యక్తిగత జీవితంపై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. యాంకర్ వర్ష నిర్వహిస్తున్న ఒక ప్రత్యేక వినోద కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, తన రిలేషన్‌షిప్ స్టేటస్ మరియు వివాహ వ్యవస్థపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రస్తుతం తాను ఒంటరిగానే (సింగిల్) ఉన్నానని తెలిపిన సుప్రీత, ఒక్కోసారి ఒంటరిగా ఉండటం విసుగు తెప్పిస్తోందని పేర్కొన్నారు. తనకు సరైన వ్యక్తి లభించడం లేదని, మంచి అబ్బాయి దొరికితే త్వరగా పెళ్లి చేయాలని తన తల్లిని కోరినట్లు సరదాగా వ్యాఖ్యానించారు. ప్రస్తుత సమాజంలో విడాకులు, దంపతుల మధ్య తలనెత్తుతున్న వివాదాలను చూసి తన పెళ్లి విషయంలో తల్లి సురేఖ వాణి కాస్త ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ, తనకు మాత్రం అలాంటి భయాలేమీ లేవని స్పష్టం చేశారు. ఎలాంటి పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొంటానని, పెళ్లి తర్వాత భర్తను తన నియంత్రణలోనే ఉంచుకుంటానంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు నవ్వులు పూయించాయి. కవర్ సాంగ్స్, లఘు చిత్రాల ద్వారా గుర్తింపు పొందిన సుప్రీత, ప్రస్తుతం వెండితెర మరియు బుల్లితెరపై తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. తల్లి సురేఖ వాణితో కలిసి ఆమె చేసే రీల్స్, ఫోటోషూట్‌లకు నెటిజన్ల నుంచి విశేష ఆదరణ లభిస్తున్న తరుణంలో, పెళ్లిపై సుప్రీత చేసిన ఈ వ్యాఖ్యలు అభిమానుల్లో కొత్త ఆసక్తిని రేకెత్తించాయి.

# స్టార్‌డమ్‌కు దూరంగా ఆయేషా టకియా

## కుటుంబ జీవితానికే అగ్రతాంబూలం!

ముంబై, అక్టోబర్ 9 (స్పంద న్యూస్): అక్కినేని నాగార్జున సరసన 'సూపర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించడంతో పాటు, సల్మాన్ ఖాన్‌తో కలిసి 'వాంటెడ్' మూవీతో బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన అందాల నటి ఆయేషా టకియా సినీ ప్రస్థానం మరోసారి ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. కెరీర్ అత్యున్నత శిఖరాల్లో ఉన్న సమయంలోనే వెండితెరకు స్వస్తి చెప్పిన ఆమె, వంర్తమానంలో స్టార్‌డమ్‌కు దూరంగా ప్రశాంతమైన కుటుంబ జీవితాన్ని గడుపుతున్నారు. చిన్న వయసులోనే మోడలింగ్‌లోకి అడుగుపెట్టిన ఆయేషా టకియా, షాహిద్ కపూర్‌తో కలసి చేసిన 'కంలోన్' ప్రకటన మరియు ఫల్గుణి పాఠక్ పాడిన 'మేరీ చునర్ ఉడ్ ఉడ్ జాయే' మ్యూజిక్ వీడియోతో యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్నారు. 2004లో 'టార్జాన్: ది వండర్ కార్' చిత్రంతో బాలీవుడ్‌లోకి అరంగేట్రం చేసి, తొలి చిత్రానికే 'ఉత్తమ నూతన నటి'గా ఫిలిమ్‌ఫేర్ పురస్కారాన్ని అందుకని అందరి దృష్టిని ఆకర్షించారు. ఆ తర్వాత 'సోచా నా థా', 'దోర్' వంటి చిత్రాల్లో వైవిధ్యమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. వరుస అవకాశాలతో అత్యంత బిజీగా ఉన్న తరుణంలోనే, 2009 మార్చి 1న తన 22వ ఏట వ్యాపారవేత్త ఫర్హాన్ అజ్మీని వివాహం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. పెళ్లి అనంతరం నటనకు వీడ్కోలు చెప్పిన ఆమె కుటుంబ బాధ్యతలకు ప్రాధాన్యమిచ్చారు. 2013లో వీరికి కుమారుడు మైకేల్ జన్మించాడు. ఒకానొక దశలో ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారంటూ వచ్చిన ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో జరిగిన ట్రోలింగ్‌పై స్పందిస్తూ ఆ ఫోటోలు మార్ఫింగ్ చేసినవని స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం విలాసవంతమైన సినీ జీవితానికి, సోషల్ మీడియా హడావుడికి దూరంగా ఉంటూ జంతు సంరక్షణ కార్యక్రమాలు మరియు కుటుంబ సంక్షేమానికే తన సమయాన్ని కేటాయిస్తున్నారు.





# 'భోగి'లో పల్లె పరిమళం.. తొలి పాట విడుదల

**హైదరాబాద్, అక్టోబరు 9 (స్పంద న్యూస్):** చార్మింగ్ స్టార్ శర్వానంద్ కథానాయకుడిగా, సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ చిత్రం 'భోగి' నుంచి తొలి పాట 'ఎగిలివారంగ' విడుదలైంది. చిత్ర ప్రచారంలో భాగంగా విడుదల చేసిన ఈ జానపద గీతం సంగీత ప్రియులను ఆకట్టుకుంటోంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. 'ఎగిలివారంగ' పాటకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా, ప్రముఖ గేయ రచయిత చంద్రబోస్ సాహిత్యం సమకూర్చారు. నల్గొండ గద్దర్ నరసన్న, కందుకూరి శంకర్ బాబు, రేలారే గోపాల్ తమ గాత్రంతో పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విడుదలైన పోస్టర్‌లో పండుగ వాతావరణం ప్రతిబింబిస్తోంది. ఈ పాటను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న దర్శకుడు సంపత్ నంది.. ఇది కేవలం పాట మాత్రమే కాదని, ప్రతి పల్లె ఆత్మను పలకరించే మధురమైన జ్ఞాపకమని పేర్కొన్నారు. చంద్రబోస్ భావాలు, భీమ్స్ రాగాలు కలసి ఈ గీతానికి ప్రత్యేకతను తీసుకొచ్చాయని తెలిపారు. 1960ల నాటి గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా టీజర్ ఇప్పటికే యూట్యూబ్‌లో కోటిన్నర వీక్షణలను దాటినట్లు చిత్రబృందం వెల్లడించింది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె. రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శర్వానంద్‌కు జోడీగా అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి నటిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి 'భోగి'ని నవంబరు 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.




"This newspaper is published by JAMMUGANI MOHAN from D.No. 13-19 Selapadu, Guntur, Andhrapradesh - 522213. on behalf of AK PUBLICATIONS, Editor by JAMMUGANI MOHAN and printed by JANAPATI VENKATA RAMESH BABU at D.NO. 5-74A, GANGIREDDY PALEM, BELLAMKONDA, GUNTUR, ANDHRA PRADESH - 522411." PRGI NO: APMUL/26/A3106. Email: epaper.spandanews@gmail.com , Cell: 94908 24686

స్పంద



## మరమ్మతులు కారణంగా విద్యుత్ కోత

యడ్లపాడు, అక్టోబర్ 10 (స్పందన్యూస్): రెండో శనివారం సందర్భంగా విద్యుత్ మరమ్మత్తుపనిలో భాగంగా మండలంలోని తిమ్మాపురం, దింతెనపాడు, జగ్గాపురం, జాలాది, కారుచోల, చెంగిస్ ఖాన్ పేట, సొలస, లింగారావుపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలివేయబడుతుందని విద్యుత్ అధికారులు తెలిపారు.కావున ఎడ్లపాడు మండలం వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు.

## కొల్లూరు మండలంలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



కొల్లూరు, అక్టోబర్ 09(స్పంద న్యూస్): ఈపూరు లంక, జువ్వలపాలెం, కొల్లూరు, చిలుమూరు సబ్ స్టేషన్‌లకు చెందిన గ్రామాలలో విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని కొల్లూరు ఇంచార్జ్ ఏఈఈ సాయి రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పైన సబ్‌స్టేషన్ కింద మరమ్మత్తు పనులు జరుగుతు న్నాయని అన్నారు. చిలుమూరులంక, సుగ్గుణ లంక, ఈపూ రులంక, చింతల్లంక, పెదలంక, తిప్పలకట్ట, జువ్వలపాలెం, కిష్కిందపాలెం, పోతార్లంక, తడికలపూడి, తురకపాలెం, తోకలవానిపాలెం, కొల్లూరు తొలితర గ్రామాలలో శనివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు తమకు సహకరించాలన్నారు.

## గుంటూరు రూరల్ మండల, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విస్తృత స్థాయి సమావేశం పాల్గొన్న బలసాని.



ప్రత్తిపాడు అక్టోబర్ 09(స్పంద న్యూస్)ప్రత్తిపాడు నియోజకవర్గం, శుక్రవారం మధ్యాహ్నం, గుంటూరు నగరం, జీఖజ కాలేజీ రోడ్డులో గల వికాస్ ఇన్ హోటల్ నందు, మాజీ ముఖ్యమంత్రి వర్యులు, గౌరవ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు వై.యస్ జగన్ మోహన్ రెడ్డి" ఆదేశాల మేరకు,గుంటూరు రూరల్ మండల మరియు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల 11 డివిజన్ల విస్తృత స్థాయి సమావేశం మరియు పార్టీ పదవుల గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, పలువురు నేతలకు ఐ.డి కార్డులను వారి చేతుల మీదుగా అందచేసిన, ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త "బలసాని కిరణ్ కుమార్" .ఈ సందర్భంగా బలసాని మాట్లాడుతూ, మండలంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆ బాధ్యతా మరి ముఖ్యంగా పార్టీ పదవులు పొందిన వారందరిపై ఉంటుంది అని అన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు విసుగు చెందారు అని అన్నారు.పార్టీ గెలుపే లక్ష్యంగా మండలంలో, గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఏకమై స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు దిశగా పని చేయాలని తెలిపారు మరియు గతంలో జగన్ మోహన్ రెడ్డి చేసిన సంక్షేమ పథకాల లబ్ది ప్రతి ఒక్కరికీ వివరించాలని తెలియజేశారు. 2029 లో జగన్ కచ్చితంగా ముఖ్యమంత్రిగా అవుతారని, ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగరవేసి తీరుతామని అని అన్నారు. ఈ కార్యక్రమంలో, గుంటూరు రూరల్ మండల ,మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 11 డివిజన్ల గ్రామాల వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబుని కలసిన ఎమ్మెల్యే కొండయ్య



చీరాల అక్టోబర్ 9 ( స్పంద న్యూస్ ) టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం నరసింగోలులో మీ భూమి–మీ హక్కు కార్యక్రమంకు విచ్చేసిన ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కొండయ్య జిల్లా పార్టీ నేతలతో కలసి ఘన స్వాగతం పలికారు. సీఎం రాకతో స్థానిక పార్టీ నేతలు కార్యకర్తలు మరియు రైతు సోదరులు 'జై చంద్రబాబు' నినాదాలతో నరసింగోలు గ్రామం దద్దరిల్లింది. ముఖ్యమంత్రి కి స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్యే కొండయ్య తో పాటు జిల్లా పార్టీ నేతలు, వ్యవసాయ అధికారులు ఉన్నారు.

## సైబర్ నాలెడ్జ్ పై అవగాహన సదస్సు

క్రోసూరు అక్టోబర్ 9 (స్పంద) క్రోసూరు మండలం ఊటుకూరు మరియు బయ్యవరం జిల్లా పరిషత్ హై స్కూల్లో సైబర్ నాలెడ్జ్ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత తండు లక్ష్మణ్ వహించారు. ముఖ్యఅతిథిగా సంస్థ నుండి సిస్టర్ డియానా మాట్లాడుతూ నేటి కాలంలో పిల్లలు ఆన్‌లైన్ తరగతులు, మొబైల్ ఫోన్లు, వాట్సాప్, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాలను ఉపయోగిస్తు న్నారు. వీటిని ఉపయోగించేటప్పుడు ఎదురయ్యే ప్రమాదాలను గుర్తించి, వాటి నుంచి తమను తాము రక్షించుకోవడం చాలా ముఖ్యం అన్నారు.రిసోర్స్ పర్సన్ గా సంస్థ కోఆర్డినేటర్ నూతక్కి దిలీప్ కుమార్ మాట్లాడుతూ పిల్లలు తెలుసుకోవాల్సిన ముఖ్యమైన సైబర్ భద్రతా అంశాలు 1. వ్యక్తిగత సమాచారం పంచుకోకూడదు 2. బలమైన పాస్‌వర్డ్ ఉపయో గించాలి 3 .అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలి 4 నకిలీ లింకులను క్లిక్ చేయకూడదు 5 ఓటిపి ఎవరికి చెప్పకూడదు .6. ఫోటోలు వీడియోలు ఎవరి షేర్ చేయకూడదన్నారు. ఊటుకూరు హెచ్ఎం ప్రకాష్ రావు మాట్లాడుతూ పిల్లల చేత ప్రతిజ్ఞ చేయించారు "నేను ఇంటర్నెట్‌ను సురక్షితంగా, బాధ్యతా యుతంగా ఉపయోగిస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. నా వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోను. ఓటిపి పాస్‌వర్డ్‌లను ఎవరికీ చెప్పను. ఆన్‌లైన్‌లో ఇతరులను వేధించను. సైబర్ వేధింపులు లేదా మోసాలు ఎదురైతే నమ్మకమైన పెద్దలకు తెలియజేస్తాను. సైబర్ భద్రతపై నా తోటి పిల్లలకు కూడా అవగాహన కల్పిస్తాను ఈ కార్యక్రమంలో సాంబశివరావు మాస్టారు మారుతి మాస్టారు సంస్థ సిబ్బంది మరియమ్మ, మౌనిక ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

# గుంటూరు తూర్పులో వార్డుల పునర్విభజనపై

# సంగడిగుంట ముస్లిం ప్రజల ఆగ్రహం

### "దిల్ సే హమారా సంగడిగుంట - బడి మసీద్ హమారా" నినాదంతో శాంతియుత నిరసన, సంతకాల సేకరణ



గుంటూరు, అక్టోబర్ 09(స్పంద న్యూస్):గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని సంగడిగుంట పాత 13వ వార్డును ఇప్పుడు కొత్త 22వ వార్డుగా మార్చి, సంగడిగుంటలో పాత చెక్కల బజార్ వద్ద 1946 నుండి ఉన్న చారిత్రాత్మక పెద్ద మసీదు (బడి మసీద్) ను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా డీఎస్ నగర్ వార్డులో కలపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈరోజు శుక్రవారం మధ్యాహ్నం జుమ్మా నమాజ్ అనంతరం సంగడిగుంట పెద్ద మసీదు వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది.

గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మరియు గుంటూరు మున్సిపల్ కమిషనర్ గారు పెద్ద మసీదు మత పెద్దలకు గానీ, స్థానిక సంగడిగుంట ముస్లిం ప్రజలకు గానీ ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, ఏకపక్షంగా వార్డులను మార్చడం ఇష్టారాజ్యంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

1946 నుండి సంగడిగుంట గుర్తింపుగా, మా మతపరమైన, సాంస్కృతిక కేంద్రంగా ఉన్న పెద్ద మసీదును సంగడిగుంట నుండి వేరు చేయడం సరికాదు. "మా సంగడిగుంట గుర్తింపు – మా పెద్ద మసీదు" అని, మసీదును తిరిగి పాత 13వ వార్డు (ప్రస్తుత సంగడిగుంట వార్డు పరిధిలోనే) కొనసాగించాలని డిమాండ్ చేస్తూ "దిల్ సే హమారా సంగడిగుంట – బడి మసీద్ హమారా" అనే కార్యక్రమంతో స్థానిక ముస్లిం ప్రజల మద్దతుతో భారీ సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు.

మా ప్రధాన డిమాండ్లు:

1. 1946 నాటి చారిత్రాత్మక సంగడిగుంట పెద్ద మసీదును డీఎస్ నగర్ వార్డు నుండి తొలగించి, తిరిగి సంగడిగుంట పాత 13వ వార్డు పరిధిలోనే కొనసాగించాలి.
2. వార్డుల పునర్విభజనలో స్థానిక మత పెద్దలు, ప్రజల అభిప్రాయం తీసుకోవాలి.
3. సంగడిగుంట ముస్లిం ప్రజల మనోభావాలను గౌరవించాలి.

తక్షణమే మా డిమాండ్ నెరవేర్చకపోతే సంగడిగుంట ముస్లిం ప్రజలందరం ఏకమై పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సంగడిగుంట పెద్ద మసీదు మత పెద్దలు, స్థానిక ముస్లిం ప్రజలు, యువత విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓ సారూ ఈ మురుగు వ్యవస్థ పై జర శ్రద్ధ చూపండి



కారంపూడి, అక్టోబర్ 9, ( పల్నాడు జిల్లా) స్పంద న్యూస్ : – మండల కేంద్రం మరియు మేజర్ పంచాయతీ అయినా కారంపూడి పట్టణంలో మురుగు వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండి, కొన్ని ప్రదేశాలలో దుర్గంధం వెద జల్లుతూ ఉందని పట్టణ ప్రజలు పంచాయతీ అధికారులపై విమర్శలు గుప్పిస్తున్నారు. వినుకొండ రోడ్ లోని పెద్ద మసీదు ఎదరు రోడ్డు చివరలో ఉన్న బందర్మియా ఇంటి సమీపంలో గత కొంతకాలంగా వీధిలో మురుగునీరు నిలబడి ఉండుటవలన పాదచారులు,అక్కడ ఉన్న గృహస్థులు దుర్గంధంతో నానా ఇబ్బందులు పడుతూ,అనేక మార్లు పంచాయతీ అధికారులకు చెప్పిన ప్రయోజనం లేకుండా పోయిందని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ మురుగు గుంత పక్కనే ఎలిమెంటరీ ఉర్దూ పాఠశాల ఉండి, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు మురుగులో నుండి పాఠశాలకు వచ్చి పోవడంతో, దుర్వాసన ఎక్కువ అయ్యి పాఠశాల పిల్లలు, ఆ ప్రాంత నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లుగా ఆ ప్రాంతవాసులు చెప్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ మురుగు వ్యవస్థతో మేము, పాఠశాల విద్యార్థులు బాధలు అనుభవిస్తున్నట్లుగా చెప్తున్నారు. పంచాయతీ పారిశుద్ధ ఇన్స్పెక్టర్లు, పారిశుద్ధ కార్మికులు ఇలాంటివి పట్టించుకోవడంలేదని,మురుగు వ్యవస్థను బాగు చేసే ప్రయత్నం కూడా చేయలేదని బాధను వ్యక్తం చేస్తున్నారు. ఈమురుగునీరు వల్ల పంచాయతీ పంపుల ద్వారా వచ్చే నీరు కూడా కలుషితమై మురుగు వాసన వస్తుందని, ఇప్పటికైనా పంచాయతీ వారు తగు చర్యలు తీసుకొని వెంటనే ఇక్కడ ఉన్న డ్రైనేజ్ వ్యవస్థను పునరుద్ధించాలని పంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మారుమూల ప్రాంతాల నుండి వైద్య పరీక్షలకు వచ్చే గర్భిణీలు

# ఆకలికి ఇబ్బంది పడకూడదు




అమరావతి, అక్టోబర్, 9 (స్పంద మారుమూల ప్రాంతాల నుండి వైద్య పరీక్షలో నిమిత్తం వచ్చే గర్భిణీలు ఆకలితో ఇబ్బంది పడకుండా ఉండేందుకే వారికి పోషకాహారాన్ని పంపిణీ చేస్తున్నామని, తొంభై సంవత్సరాల వయస్సు పైబడిన కొలసాని నాగేశ్వరమ్మ గర్భిణీల పోషకాహారానికి సహకారం అందించి ఆదర్శంగా నిలిచిందని జన చైతన్య సమితి కార్యదర్శి అన్నవరపు స్టాలిన్ బాబు అన్నారు.పల్నాడు జిల్లా అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ యువజన పథకం ద్వారా స్కానింగ్ పలువైద్య పరీక్షలు నిమిత్తం వచ్చిన గర్భిణీలకు శుక్రవారం జన చైతన్య సమితి ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా కూచిపూడి సమీపంలోని శ్రీరామపురం గ్రామానికి చెందిన 90 సంవత్సరాల వయసుకు పైబడిన కొలసాని నాగేశ్వరమ్మ సహకారంతో గర్భిణులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రతి నెల 9 వ తారీఖున గర్భిణులు, వారి సహాయ కులకు పౌష్టికాహారాన్ని అందిస్తూ మాతాశిశు ఆరోగ్య పరిరక్షణకు మావంతు కృషి చేస్తున్నామన్నారు.తొంభై సంవత్సరాల వయసు ప్రవీణ్ పైబడిన సమాజ శ్రేయస్సు కోసం నాగేశ్వరమ్మ చూపుతున్న సేవా తత్పరత అందరికీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అమరావతి సామాజిక ఆరోగ్య కేంద్రం (సిహెచ్సి) వైద్యులు డాక్టర్ భవనాసి రమ్య మాట్లాడుతూ గర్భిణులకు సరైన పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన తల్లులు, ఆరోగ్యవంతమైన భావితరాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. గర్భధారణ సమయంలో పోషకాహారం ఎంతో అవసరమని, ఆర్థికంగా వెనుకబడిన గర్భిణులకు అండగా నిలవాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న నిర్వాహకులు జన చైతన్య సమితి ప్రతినిధులు అభినందనీయులన్నారు. జనచైతన్య సమితి ప్రతినిధి తుళ్లూరు సాంబశివరావు మాట్లాడుతూ వయస్సు మీద పడినా సేవా దృక్పథంతో ముందుకు వచ్చిన కొలసాని నాగేశ్వరమ్మ ఔదార్యం నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని,సేవ చేయడానికి వయసుతో సంబంధం లేదని, సమాజానికి మేలు చేయాలనే గొప్ప మనసు ఉంటే చాలని అన్నారు. ఇటువంటి దాతల సహకారమే స్వచ్ఛంద సంస్థల సేవా కార్యక్రమాలకు బలమని, ఆమెకు జన చైతన్య సమితి తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతుగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మీరా లీలా ప్రసాద్, జన చైతన్య సమితి ప్రతినిధులు దాసరి విజయ్ బెన్నిబాబు,బెజ్జం నాగేశ్వరరావు,షేక్ లియాకత్ అలీ, స్టాఫ్ నర్స్ పూదోట లిల్లి రోజ్ రాణి, గర్భిణులు, పలువురు పాల్గొన్నారు.గర్భిణీలకు భోజనంతోపాటు డ్రై ఫ్రూట్ లడ్లు,శనగ విత్తనాల లడ్లు, స్వీటు,కోడిగుడ్లు, డ్రాగన్ పండ్లు, బత్తాయి కాయలు, అరటి పండ్లు పంపిణీ చేశారు.

## సమన్వయకర్తగా మండలనేని చరణ్ తేజ నియామకం

### హర్షం వ్యక్తం చేసిన శ్రేణులు



చిలకలూరిపేట అక్టోబర్ 9 స్పంద న్యూస్ జనసేన పార్టీ నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తలుగా నలుగురు కీలక నేతలను పార్టీ అధిష్ఠానం నియమించింది. వీరిలో చిలకలూరిపేటకు చెందిన యువ నాయకుడు మండలనేని చరణ్ తేజకు చోటు దక్కడం పట్ల నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది. చరణ్ తేజ నియామకంపై చిలకలూరిపేట నియోజకవర్గ జనసైనికులు, వీర మహిళలు, పార్టీ కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తున్న యువ నాయకత్వానికి తగిన గుర్తింపు దక్కిందని స్థానిక నేతలు కొనియాడారు. ఈ బాధ్యతతో పార్లమెంట్ పరిధిలో పార్టీ మరింత విస్తృతంగా ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేస్తూ, చరణ్ తేజకు పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలియజేశాయి.

# గురజాల నియోజకవర్గం లో మున్సిపోల్ కు రంగం సిద్ధం

**-నేడో రేపో నోటిఫికేషన్ వెలువడే అవకాశం.**

దాచేపల్లి, స్పంద న్యూస్.గురజాల నియోజకవర్గం లో మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్దమైంది.బిసి లకు ప్రభుత్వం ఇచ్చిన 34 శాతం జీవో ను శుక్రవారం సుప్రీం కోర్టు కొట్టివేయడం తో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టిన నేపథ్యంలో పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం లోని పిడుగురాళ్ళ, దాచేపల్లి, గురజాల మూడు మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే మూడు మున్సిపాలిటీ లలో వార్డుల విభజన తో పాటు వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేశారు. ఇప్పటికే రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాలు అందజేశారు.అంతేగాకుండా పోలింగ్ బూత్ లను కూడా అధికారులు సిద్ధం చేశారు.జూలై నెల నుండి స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం ప్రకటన చేసిన దగ్గర్నుండి ఎప్పుడా.. ఎప్పుడా అని ప్రజలు ఎదురు చూస్తున్న నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో బి సి లకు 34 శాతం రిజర్వేషన్ అమలు కు ప్రభుత్వం జీవో ఇవ్వడం తో సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు వ్యతిరేకం అంటూ సామాజిక కార్యకర్తలు కొందరు హైకోర్టు ను ఆశ్రయించడం తో సెప్టెంబర్ లో మున్సిపల్ ఎన్నికలు జరపాలన్న ప్రభుత్వం నిర్ణయానికి బ్రేక్ పడింది. దీంతో అక్టోబర్ లో ఖచ్చితంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయం తో ఉండగా, 34 శాతం జీవో ను హైకోర్టు కొట్టివేస్తు, పాత పద్ధతి లో 6 వారాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది.34 శాతం జీవో పై ప్రభుత్వం సుప్రీం కోర్టు ను ఆశ్రయించడం తో మళ్ళీ ఎన్నికల నిర్వహణ పై సందిగ్ధం ఏర్పడింది. అయితే సుప్రీం కోర్టు ఈ కేసును త్వరగా తేల్చడం తో మున్సిపల్



ఎన్నికలకు లైన్ క్లియర్ కావడం తో త్వరితగతిన నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టింది. నియోజకవర్గం లోని ప్రధాన రాజకీయ పార్టీలు ముమ్మరంగా నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. గురజాల నియోజకవర్గం లో మున్సిపల్ ఎన్నికలను అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని పావులు కదుపుతున్నాయి.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల కవాతు

## ఓటరులో ధైర్యంశాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

చిలకలూరిపేట అక్టోబర్ 9 స్పంద న్యూస్

రాబోయే మున్సిపల్ ఎన్నికల నగారా మోగుతున్న వేళ, పట్టణంలో ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. అయితే, ఈ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా, పూర్తి ప్రశాంత వాతావరణంలో జరగాలన్నదే పోలీసు యంత్రాంగం ప్రధాన సంకల్పం. ప్రతి పౌరుడూ నిర్భయంగా, స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకోవాలనే లక్ష్యంతో చిలకలూరిపేట పోలీసులు ప్రజల్లో భరోసా నింపేందుకు రంగంలోకి దిగారు.పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ ఆదహల్లి ఆదేశాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా 'మీకు అండగా మేమున్నాం' అనే సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు చిలకలూరిపేట టౌన్ సీఐ రమేష్ నేతృత్వంలో శుక్రవారం సాయంత్రం భారీ సాయుధ కవాతు నిర్వహించారు.

సుమారు 150 మంది ప్రత్యేక పోలీస్ బలగాలు ఏకతాటిపై కదులుతుండగా పట్టణ పురవీధులు ఖాకీ పహారాతో దద్దరిల్లాయి. ఎన్ఆర్టీ సెంటర్ వద్ద ప్రారంభమై చౌత్ర సెంటర్, కళామందిర్ సెంటర్ మీదుగా అడ్డరోడ్డు వరకు సాగింది. ముఖ్యంగా సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాల్లో ఈ కవాతును ప్రత్యేకంగా నిర్వహించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.కవాతులో అడుగడుగునా బలగాల క్రమశిక్షణ,



గంభీరమైన కదలికలు స్థానిక ప్రజల్లో నైతిక ధైర్యాన్ని, భద్రతా భావాన్ని రెట్టింపు చేశాయి. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ రమేష్‌తో పాటు రూరల్ సీఐ సుబ్బ నాయుడు, ఎస్సైలు సోమేశ్వరరావు, హాజరత్తయ్య, శివరామకృష్ణ మరియు టౌన్ పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికల వేళ అల్లర్లకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని, ఓటర్లు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా తమ రాజ్యాంగ హక్కును వినియోగించుకోవాలని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# మున్సిపల్ భవన కూల్చివేత పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



తెనాలి, అక్టోబర్09(స్పంద న్యూస్)పాత మున్సిపల్ భవనాల కూల్చివేత పనులను శుక్రవారం కమిషనర్ జె. రామ అప్పల నాయుడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కూల్చివేత పనుల పురోగతిని సమీక్షించి, పనులను నిబంధనల ప్రకారం చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

కూల్చివేత సమయంలో కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని,పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కూల్చివేత ద్వారా వెలువడే నిర్మాణ వ్యర్థాలను సక్రమంగా తొలగించి, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ జె. రామ అప్పల నాయుడు ఆదేశించారు.

# చంద్రబాబు కష్టమంతా ప్రజలకోసమే. : ప్రత్తిపాటి

**-జగన్ పాలనలో ప్రభుత్వ గొప్పలు ప్రజలకు అప్పులే మిగిలాయి.**



యడ్లపాడు అక్టోబర్ 9 స్పంద న్యూస్జగన్ పాలనలో ప్రభుత్వ గొప్పలు.. ప్రజలకు అప్పులే మిగిలాయని, మరోసారి వైసీపీ అధికారంలోకి వచ్చి ఉంటే ప్రజల ఆస్తులు అన్యాక్రాంతమై.. రాష్ట్రం పరిస్థితి దారుణంగా తయారయ్యేదని, వయసుని, ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా నేడు చంద్రబాబు పడుతున్న కష్టమంతా ప్రజలకోసమేనని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన యడ్లపాడు మండలం లింగారావుపాలెంలో పల్లెపండుగ 2.0, 3.0 కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత స్థానిక బీసీ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించిన ప్రత్తిపాటి. అనంతరం ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామ పాడి రైతులకు రూ.3 లక్షల విలువైన సంగం డెయిరీ బోనస్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల్ని ఉద్దేశించి ప్రత్తిపాటి మాట్లాడారు. అత్తెసరు సంక్షేమంతో.. జగన్ వేల కోట్లు కొల్లగొట్టాడు.జగన్ ఐదేళ్లు అత్తెసరు సంక్షేమాన్ని ప్రజలకు అందించి.. వేలకోట్లు కొల్లగొట్టాడని, ఆయన చేసిన అప్పులు తీరుస్తూనే, నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు అవసరమైన సంక్షేమం.. రాష్ట్రాభివృద్ధిని కొనసాగిస్తున్నారని ప్రత్తిపాటి వివరించారు. తల్లికి వందనం పథకం అమలును ప్రభుత్వం, మంత్రి నారాలోకేశ్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, జగన్ లా ఒకరికే ఇచ్చి, తల్లుల్ని మోసగించడం లేదన్నారు.



# తిమ్మాపురం గ్రామంలో 140 మంది పోలీసు సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్

యడ్లపాడు,అక్టోబర్ 10 (స్పందన్యూస్ ):పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీ అదహల్లి జగదీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, నరసరావుపేట డీఎస్పీ శ్రీ ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో, చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీ బి. సుబ్బానాయుడు, చిలకలూరిపేట టౌన్ సీఐ శ్రీ పి. రమేష్ గార్ల ఆధ్వర్యంలో, ఎడ్లపాడు ఎస్ఐ టి. శివరామకృష్ణ మరియు చిలకలూరిపేట టౌన్ ఎస్ఐ హజరతయ్యతో పాటు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన 140 మంది పోలీసు సిబ్బందితో శుక్రవారం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడం, ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడటం, శాంతిభద్రతలను కాపాడటమే లక్ష్యంగా ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులు గ్రామంలోని ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్ల మీదుగా కవాతు నిర్వహించి, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉందనే సందేశాన్ని ప్రజలకు అందించారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే చర్యలు, గొడవలు, బెదిరింపులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఎన్నికల సమయంలో ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, గ్రామంలో శాంతియుత వాతావరణాన్ని కాపాడేందుకు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, శాంతిభద్రతలకు భంగం కలిగించే సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల భద్రత, ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపడతామని పోలీస్ అధికారులు తెలిపారు.



# బీసీ ల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీ తోనే సాధ్యం



గురజాల, అక్టోబర్ 09(స్పంద న్యూస్ ): బీసీ ల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీ తోనే సాధ్యం అని నాయీబ్రాహ్మణ నియోజకవర్గ యువ నాయకులు మాచర్ల నాగేశ్వరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ రాష్ట్రంలోని అనేక కులాల సమాహార మైన బీసీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెంది, అన్ని రంగాల్లో ముందుం డాలన్నదే తెలుగుదేశం పార్టీ ఆశయం అని అన్నారు.బీసీ రిజర్వేషన్లకు న్యాయపరమైన అడ్డంకులు ఎదురై, హై కోర్టు, సుప్రీంకోర్టు స్థాయిలో ప్రతికూల తీర్పులు వెలువడినప్పటికీ, బీసీలకు న్యా యం చేయాలన్న తన సంకల్పాన్ని నిజం చేస్తూ పార్టీ అధినేత, ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు పార్టీ పరం గా బీసీ లకు 34 % రిజర్వేషన్ కల్పిస్తూ జీ ఓ విడుదల చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆనాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించి, రాజకీయాల్లో వారికి సముచిత స్థానం కల్పించేందుకు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. అదే స్ఫూర్తితో నేడు మన నాయకుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీల రాజకీయ సాధికారత కోసం 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీఓ జారీ చేశారు అని అన్నారు.మహాత్మా జ్యోతిరావు పూలే గారు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఏ విధంగా పోరాడారో, అదే స్ఫూర్తితో నేడు బీసీలందరం ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. బీసీల అభ్యున్నతి, సమాన అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఐకమత్యంతో కృషి చేయాలి పిలుపు నిచ్చారు.ఈ సందర్భంగా బీసీ వర్గాల తరఫున నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లో బీసీల అభ్యున్నతి, రాజకీయ సాధికారత లక్ష్యంగా ఐక్యంగా ముందుకు సాగుతాం అని తెలియ చేశారు. బీసీల హక్కులు, అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా పాల్గొంటాం అని అన్నారు.

# శ్రీ లక్ష్మీ అమ్మవారి సేవలో జూలకంటి శరన్నవరాత్రుల ఉత్సవాలపై సమీక్ష



దుర్గి అక్టోబర్ 09 ( స్పంద న్యూస్ ) అడిగొప్పల శ్రీ నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారిని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం రానున్న దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలను ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు లింగా బ్రహ్మయ్య,మునిగోటి సత్యానారాయణ, యాగంటి వెంకటేశ్వర్లు, గరిణే రమేష్, యాగంటి నరేష్, కొమెరా దుర్గారావు, జక్కా రమేష్, వలి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలి

**- ఎంపీడీవో రవికుమార్.**





వేమూరు, అక్టోబర్ 09(స్పంద న్యూస్): గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవికుమార్ తెలియజేశారు, శుక్రవారం వేమూరు గ్రామ చెత్త సంపద కేంద్రం వద్ద గ్రామపంచాయతీ అధికారులు మరియు గ్రీన్ అంబాసిడర్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎక్స్ ఫ్లోర్ విధానం, చెత్త సంపద తయారీ విధానాలపై అవగాహన కల్పించారు, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామపంచాయతీలో తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలని తెలియజేశారు, కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు కోటేశ్వరరావు, సుభాష్ చంద్రబోస్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి - వరికూటి అశోక్ బాబు

కొల్లూరు, అక్టోబర్ 09 (స్పంద న్యూస్): రానున్న స్థానిక ఎన్నికలకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని వేమూరు నియోజవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు అన్నారు. శుక్రవారం అద్దేపల్లి లో అశోక్ బాబు మాట్లాడుతూ ఎంపీటీసీ, జడ్పీటీసీ, స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సంసిద్ధంగా ఉండి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రతి గడపకు జగనన్న పాలనలో జరిగిన మంచిని తీసుకెళ్లాలన్నారు..

**ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాల**

న్నారు.వైసీపీ పార్టీ భట్టిప్రోలులో బలంగా ఉందన్నారు. నేడు ప్రజలంతా తిరిగి వైసీపీ నాయకత్వాన్ని, జగనన్న పాలనను కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు టౌన్ ప్రెసిడెంట్ కుందేటి రమేష్ , మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## భట్రుపాలెంలో డిఎం అండ్ హెచ్ ఓ బృందం పర్యటన



దాచేపల్లి, అక్టోబరు 9(స్పంద న్యూస్ ). పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం జిల్లా గణాంక అధికారి నీలకంటేశ్వర రావు ఆధ్వర్యంలో జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు శుక్రవారం దాచేపల్లి మండలంలోని భట్రు పాలెం గ్రామం సందర్శించారు. గ్రామం లో స్థానికంగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య సిబ్బందికి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించి, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం గురించి, కిషోర్ బాల బాలికల కార్యక్రమం గురించి వివరించారు. అధేవిదంగా రికార్డులను పరిశీలించారు. అర్హులైన వారికి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య కార్యక్రమాలు అమలు చేయడంలో భట్రుపాలెం ఆరోగ్య ఉప కేంద్రంముందంజలో ఉండాలని ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అమూల్య, జిల్లా ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరావు, హెల్త్ సూపర్వైజర్లు పట్టాభి ,లక్ష్మయ్య ,మైత్రి, లలిత, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల తరలింపునకు వైసీపీ విధానాలే కారణం

### కరవులోనూ హంద్రీనీవా జలాలు.. పోలవరం పూర్తి బాధ్యత కూటమి ప్రభుత్వానిదే

### పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పుంగనూరు అక్టోబర్ 9 (స్పంద న్యూస్): గత వైసీపీ ప్రభుత్వ విధానాల వల్లే పరిశ్రమలు, పెట్టుబడులు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి విమర్శించారు. శుక్రవారం పుంగనూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అమరరాజా వంటి ప్రముఖ పరిశ్రమను ఇబ్బందులకు గురిచేయడం వల్ల రూ.9 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కావాల్సిన పరిశ్రమ తెలంగాణకు తరలిపోయిందని ఆరోపించారు. పుంగనూరులో పెప్పర్ పరిశ్రమ ఏర్పాటు కాకపోవడానికి కారణాలేమిటో ప్రజలకు తెలియజేయాలని అన్నారు.రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే వచ్చాయని అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో కరవు పరిస్థితులు నెలకొన్నప్పటికీ జిల్లాకు హంద్రీనీవా జలాలు అందుతున్నాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు గేట్లు ఏర్పాటు చేసి, ట్యాంకర్ల ద్వారా నీటిని నింపి రైతులను మోసం చేశారని ఆరోపించారు.

ఈ సమావేశంలో పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి మధుసూదన్ నాయుడు, సుబ్రహ్మణ్యం రాజు, మనోజ్, సందీప్, మధు రాయల్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.



## బీసీలకు న్యాయం చేశాకే ఎన్నికలు జరపాలి

### బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ డిమాండ్

అక్టోబర్ 9(స్పంద న్యూస్): బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తన నివాసం నుంచి వీడియో ద్వారా మాట్లాడుతూ, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన రెండు ఉత్తర్వులను శాస్త్రీయ ఆధారాలు లేవన్న కారణంతో సుప్రీంకోర్టు కొట్టివేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీల జనాభా 50.4 శాతం ఉన్నప్పటికీ, ఆ గణాంకాలను న్యాయస్థానానికి సమర్పించకుండా ప్రభుత్వం దాచిందని ఆరోపించారు. 2027 జనాభా లెక్కల వివరాలు వెల్లడయ్యే వరకు ఎన్నికలను వాయిదా వేయాలని, బీసీలకు న్యాయం చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ఆయన కోరారు.

## బీసీలకు న్యాయం చేశాకే ఎన్నికలు జరపాలి

### బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ డిమాండ్

అక్టోబర్ 9(స్పంద న్యూస్): బీసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తన నివాసం నుంచి వీడియో ద్వారా మాట్లాడుతూ, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన రెండు ఉత్తర్వులను శాస్త్రీయ ఆధారాలు లేవన్న కారణంతో సుప్రీంకోర్టు కొట్టివేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీల జనాభా 50.4 శాతం ఉన్నప్పటికీ, ఆ గణాంకాలను న్యాయస్థానానికి సమర్పించకుండా ప్రభుత్వం దాచిందని ఆరోపించారు. 2027 జనాభా లెక్కల వివరాలు వెల్లడయ్యే వరకు ఎన్నికలను వాయిదా వేయాలని, బీసీలకు న్యాయం చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ఆయన కోరారు.



## కాన్షీరాం సేవలు చిరస్మరణీయం: శ్రీనివాసులు



పుంగనూరు అక్టోబర్ 9(స్పంద న్యూస్): పుంగనూరు పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో శుక్రవారం బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం వర్ధంతిని పార్టీ నాయకులు నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం కాన్షీరాం చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. బహుజనుల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చిన ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తామని తెలిపారు.

## స్థానిక ఎన్నికలకు పటిష్ట భద్రత

### సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా: ఎస్పీ ఉమామహేశ్వర్



బాపట్ల, అక్టోబర్ 9 (స్పంద న్యూస్): స్థానిక ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ పోలీసు అధికారులను ఆదేశించారు. అధికారులతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో గతంలో ఘర్షణలు జరిగిన ప్రాంతాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను పరిశీలించాలని, ఎన్నికల నియమావళి అమలులో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ప్రజలు భయాందోళనలు లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

### పెదనందిపాడు శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో

## కన్నులపండుగలా మాస శివరాత్రి పూజలు.





పెదనందిపాడు అక్టోబర్ 9 (స్పంద న్యూస్) పెదనందిపాడులో పురాతన దేవాలయమైన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ సోమేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా. ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక మురళీకృష్ణశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు కొండవీటి ప్రసాద్ శర్మ .కొండ కావూరి రాఘవ శర్మలు దాసరి సత్యనారాయణ వసుంధర. దాసరి వెంకట శివ నాగ కుమార్ స్వాతి. కోట ఉమామహేశ్వరరావు సౌజన్య లక్ష్మి. కూని శెట్టి వెంకట శ్రీనివాసరావు లక్ష్మీ పద్మజ దంపతులచే. గణపతి పూజ. అఖండ దీపారాధన. నవగ్రహ పూజ. మహాన్యాస రుద్ర పారాయణం. ఏకాదశి రుద్రాభిషేకం. ధూప దీప నైవేద్యం. నీరాజన మంత్రపుష్పం. వేద ఆశీర్వచనం. తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా కన్నులు పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాసరి శేషగిరిరావు కుసుమాంబ దంపతులు. తడవర్తి సురేష్ బాబు. నున్న ఆంజనేయ గుప్త. దాసరి శివ. భక్త భజన సమాజం వారు.తదితరులు పాల్గొన్నారు. దాత దాసరి సత్యనారాయణ వసుంధర దేవి సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమం విజయవంతం చేశారు.




## వైభవంగా తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారం

### తొలి దశలో 1,000 మంది జర్నలిస్టులకు ఉచిత బీమా లక్ష్యం

### తెలుగు రాష్ట్రాల్లో సంఘ విస్తరణకు కార్యాచరణ

విజయవాడ / ఇబ్రహీంపట్నం (స్పంద న్యూస్): తెలుగు జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ముందుకు సాగుతోంది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో శు క్రవారం నిర్వహించిన సంఘ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం వైభవంగా జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా మేడవరపు రంగనాయకులు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా జర్నలిస్టుల హక్కులు, వృత్తిపరమైన గౌరవం, భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని రంగనాయకులు తెలిపారు. తొలి దశలో 1,000 మంది జర్నలిస్టులకు ఉచిత బీమా సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. ప్రతి జిల్లాలో సంఘ కమిటీలను బలోపేతం చేసి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు.త్వరలో తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఉత్తమ జర్నలిస్టులకు పురస్కారాలు అందజేస్తామని తెలిపారు

.సంఘ గౌరవ సలహాదారు ఎం. విజయభాస్కర్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. ప్రధాన కార్యదర్శిగా వంగపాటి శివ, కార్యదర్శిగా ప్రదీప్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బోడపాటి సుబ్బారావు, కోశాధికారిగా మాలెంపాటి శ్రీనివాసరావుతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురు జర్నలిస్టు నాయకులు, పత్రికా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆయా శాఖల పురోగతి పై సమీక్ష సమావేశం

కాకుమాను అక్టోబర్ 9( స్పంద న్యూస్)స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు మండల శుక్రవారం పరిషత్ ప్రత్యేక అధికారి డి. వందనం అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగినది. ఈ సమావేశంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు పాల్గొని ఆయా శాఖల పురోగతి పై సమీక్ష జరిపారు. ప్రస్తుతం ఎల్ నినో పరిస్తితుల దృష్ట్యా కాకుమాను మండలం కరవు మండలం గా ప్రకటించబడిన నేపథ్యంలో ప్రజలకు సురక్షిత త్రాగునీటి ని అందించుటలో తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి మండల ఆర్ డబ్ల్యూ యస్ అధికారి తో సమన్వయం చేసుకోవాలసినదిగా పంచాయతీ అభివృద్ధి అధికారులకు సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అధికారులందరూ సంసిద్ధులై ఉండాలని సూచించారు. తదనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మొక్కలు నాటి మధ్యాహ్న భోజన పధకం అమలును పరిశీలించి విధ్యార్థినులతో కలసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారితో పాటుగా యం. పి. డి. ఒ. జి.వీరాస్వామి, డిప్యూటి యం. పి. డి. ఒ. నాగయ్య, మండల విద్యాశాఖాధికారి కెనడి పాల్గొన్నారు.







# ఇంద్రకీలాద్రిపై దసరా శోభ

## పది రోజులు పది అలంకారాల్లో కనకదుర్గమ్మ!

- అక్టోబర్ 11 నుంచి 20 వరకు దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు
- రోజుకో విశేష అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్న అమ్మవారు
- బాలా త్రిపురసుందరి నుంచి రాజరాజేశ్వరి వరకు దివ్యరూపాలు
- ప్రతిరోజూ ప్రత్యేక నైవేద్యాలు, వస్త్రాలు, పుష్పాలతో అమ్మవారికి పూజలు
- నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న ఇంద్రకీలాద్రి



విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక శోభ వెల్లివిరియనుంది. భక్తుల కొంగుబంగారమైన కనకదుర్గమ్మ పది రోజులపాటు పది విశేష అలంకారాల్లో దర్శనమివ్వనుంది. ఏ రోజు ఏ రూపంలో అమ్మవారు భక్తులను అనుగ్రహించనున్నారు..? ఏ నైవేద్యం సమర్పించాలి..? ఎలాంటి వస్త్రాలు, పుష్పాలతో పూజించాలి..? అనే వివరాలను శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం వెల్లడించింది. అక్టోబర్ 11 నుంచి 20 వరకు నిర్వహించనున్న దసరా మహోత్సవాల్లో అమ్మవారిని విశేష అలంకారాల్లో దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించాలని ఆలయ సిబ్బంది కోరారు.

- ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 9 (స్పంద న్యూస్)



### భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకోవాలి

దసరా మహోత్సవాల్లో అమ్మవారి విశేష అలంకారాలను దర్శించుకుని, నైవేద్య ప్రసాదాలను స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని దేవస్థానం సిబ్బంది భక్తులను కోరారు. పది రోజులపాటు అమ్మవారి దివ్యరూపాలను దర్శించుకునేందుకు భక్తులు ఇంద్రకీలాద్రికి తరలిరానున్నారు. అమ్మవారి ఆశీస్సులతో అందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.

### అక్టోబర్ 11
### శ్రీ బాలా త్రిపురసుందరి దేవి



తొలిరోజు అమ్మవారు బాలా త్రిపురసుందరి దేవిగా దర్శనమివ్వనున్నారు. బియ్యం, పెసరపప్పు, మిరియాలు, నెయ్యితో తయారు చేసిన పొంగలి, పాల పరమాన్నం నైవేద్యంగా సమర్పించవచ్చు. కనకాంబరం లేదా పసుపు రంగు వస్త్రాలు, మల్లెపూలు, సువాసన వెదజల్లే తెల్లటి పుష్పాలతో పూజలు నిర్వహించడం విశేషంగా భావిస్తారు.

### అక్టోబర్ 12
### శ్రీ గాయత్రీ దేవి



రెండో రోజు గాయత్రీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. పులిహోర, కొబ్బరి అన్నం నైవేద్యంగా సమర్పిస్తారు. కాషాయం లేదా నారింజ రంగు వస్త్రాలు, తామర, చామంతి, మల్లెపూలతో పూజలు నిర్వహిస్తారు.

### అక్టోబర్ 13
### శ్రీ అన్నపూర్ణాదేవి



మూడో రోజు అన్నపూర్ణాదేవిగా అమ్మవారు దర్శనమివ్వనున్నారు. దద్దోజనం, పులిహోర, మినప వడలను నైవేద్యంగా సమర్పిస్తారు. పసుపు లేదా గంధపు రంగు వస్త్రాలు, తెల్ల చామంతి, మల్లెపూలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

### అక్టోబర్ 14
### శ్రీ లలితా త్రిపురసుందరి దేవి



నాలుగో రోజు లలితా త్రిపురసుందరి దేవిగా అమ్మవారు దర్శనమిస్తారు. రవ్వ కేసరి, పరమాన్నం, పండ్ల రసాలను నైవేద్యంగా సమర్పిస్తారు. పసుపు, బంగారు లేదా ఎరుపు రంగు పట్టువస్త్రాలు, గులాబీలు, తామర, ఎరుపు రంగు పుష్పాలతో అమ్మవారిని ఆరాధిస్తారు.

### అక్టోబర్ 15
### శ్రీ సరస్వతీ దేవి



ఐదో రోజు చదువుల తల్లి సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార లేదా బెల్లంతో తయారు చేసిన పరమాన్నం నైవేద్యంగా సమర్పిస్తారు. తెలుపు రంగు వస్త్రాలు, గన్నేరు, జాజిపూలతో పూజలు నిర్వహిస్తారు.

### అక్టోబర్ 16
### శ్రీ దుర్గాదేవి



ఆరో రోజు దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. పులిహోర, బెల్లపు పొంగలి, దద్దోజనం నైవేద్యంగా సమర్పిస్తారు. పసుపు లేదా ఎరుపు రంగు వస్త్రాలు, తామర, పసుపు రంగు చామంతి పూలతో పూజలు నిర్వహిస్తారు.

### అక్టోబర్ 17
### శ్రీ మహాలక్ష్మీ దేవి



ఏడో రోజు మహాలక్ష్మీ దేవిగా అమ్మవారు దర్శనమివ్వనున్నారు. క్షీరాన్నం, దద్దోజనం, పూర్ణాలు, తొమ్మిది రకాల పిండివంటలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఎరుపు లేదా గులాబీ రంగు వస్త్రాలు, తామర, కనకాంబరం, చామంతి పుష్పాలతో ఆరాధిస్తారు.

### అక్టోబర్ 18 - శ్రీ దుర్గాదేవి, మహిషాసురమర్దిని దేవి



ఎనిమిదో రోజు అమ్మవారిని దుర్గాదేవి, మహిషాసురమర్దిని రూపాల్లో ఆరాధించనున్నట్లు అందించిన వివరాల్లో పేర్కొన్నారు. చక్కెర పొంగలి, పులిహోర, మినప గారెలు, పానకం నైవేద్యంగా సమర్పిస్తారు. నీలం, ఎరుపు లేదా గులాబీ రంగు వస్త్రాలు, శంఖుపూలు, ఎర్ర మందారాలు, తామర పూలతో పూజలు నిర్వహిస్తారు.

### అక్టోబర్ 19
### శ్రీ మహిషాసురమర్దిని దేవి



తొమ్మిదో రోజు మహిషాసురమర్దిని దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. కదంబం, చక్రపొంగలి, గారెలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఎరుపు రంగు వస్త్రాలు, ఎర్ర మందారాలు, గులాబీలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

### అక్టోబర్ 20
### శ్రీ రాజరాజేశ్వరి దేవి



చివరి రోజు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో అమ్మవారు భక్తులను అనుగ్రహించనున్నారు. క్షీరాన్నం, దద్దోజనం, బూందీ లడ్డూలను నైవేద్యంగా సమర్పిస్తారు. బంగారు, ఎరుపు లేదా గులాబీ రంగు వస్త్రాలు, ఎర్ర కలువలు, తామర, గులాబీ పుష్పాలతో పూజలు నిర్వహిస్తారు.